

తుఫాన్ అలర్ట్

బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం

- భారీ వర్షాల హెచ్చరికలతో జిల్లా అధికారులు అప్రమత్తం
- కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

COMMAND CONTROL CENTER
COLLECTOR'S OFFICE ANAKAPALLI
-: PHONE NUMBERS:-
08924-226599
08924-222888

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

అనకాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బుధవారం ఉదయానికి తుఫాన్‌గా బలపడుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్‌కు ఒమన్ దేశం సూచించిన 'దాన' అని పేరు పెట్టారు. కాగా గురువారంనాటికి తీవ్ర తుఫాన్‌గా మారి ఒడిశాలో తీరం దాటుతుందని, దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాని వాతావరణ శాఖ వెల్లడించింది. తుఫాన్ అనకాపల్లి జిల్లాపైనా ప్రభావం చూపనుండడంతో కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మంగళవారం జిల్లాలో పెద్దగా వర్షాలు కురవకపోయినా.. తుఫాన్ ప్రభావంతో ఈ నెల 24వ తేదీ నుంచి 26 వతేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకావం వుందని సమాచారం. అందువల్ల 26వ తేదీ వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత శాఖ అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, అవసరం మేరకు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు సహాయం అందించాలని సూచించారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఫోన్ నంబర్లు 08924- 226599, 222888 అందుబాటులో ఉంచారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగిస్తారు. గ్రామాల్లో అధిక వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే సహాయక చర్యలు చేపడతామని డీఆర్‌ఓ దయానిధి తెలిపారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో..

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి, తుఫాన్‌గా బలపడనున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బందిని సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా 94906 10022 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. కంట్రోల్ రూమ్‌లోని ఈ నంబరులో సిబ్బంది 24 గంటలూ మూడు షిఫ్టులలో అందుబాటులో వుంటారని చెప్పారు. వర్షాలు, ఈదురు గాలుల కారణంగా తెగిపడిన విద్యుత్‌వైర్లు, తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ వైర్లపై విరిగి పడిన చెట్ల కొమ్మలను ఎవరూ తాకవద్దని చెప్పారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం, సమస్యలు తలెత్తిన ఎడల సమీపంలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయం, టోల్‌ఫ్రీ నంబరు 1912, కంట్రోల్ రూమ్, సర్కిల్ ఆఫీస్.. ఏదో ఒకదానికి ఫోన్ చేసి ఫిర్యాదునమోదు చేసుకోవాలని సూచించారు. సమస్యను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు.

ఎలమంచిలిలో ఓపెన్ బార్‌లు!

పట్టపగలు బహిరంగంగానే మద్యపానం

- తీర్థాన్ని తలపిస్తున్న బస్టాండ్ జంక్షన్
- ఇబ్బంది పడుతున్న మహిళలు, విద్యార్థినులు
- చోద్యం చూస్తున్న పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మందుబాబులు రెచ్చిపోతున్నారు. పట్టపగలు రోడ్లపై బహిరంగంగా మద్యం సేవిస్తు న్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. నిత్యం జనంతో రద్దీగా వుండే ఆర్టీసీ బస్టాండ్ నాలుగు రోడ్ల కూడలిలో మందుబాబుల ఆగడాలు మితిమీరుతు న్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలు వున్నప్పుడు పరిస్థితి ఏ విధంగా వుందో.. ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటైన తరువాత కూడా పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదన్న నిబంధనలను బేఖాతరు చేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' పత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమైనప్పటికీ పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారుల్లో చీమకుట్టినట్టయినా లేదు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న పాన్‌షాపు వద్ద తీర్థాన్ని తలపించే రీతిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. దీంతో ఆ దారిన రాకపోకలు సాగించే మహిళలు, విద్యార్థినులు, బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర అసహనం చెందుతున్నారు. మంగళవారం ఉదయం పలువురు మందుబాబులు బస్టాండ్ జంక్షన్‌కు చెంతనే ఉన్న దుకాణంలో మద్యం కొనుగోలు చేసి, పక్కనే వున్న పాన్ షాపు వద్ద ప్లాస్టిక్ గ్లాసుల్లో పోసుకుని తాగుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే పోలీసులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని, దీంతో మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఎలమంచిలిలో ఓపెన్ బార్లను తలపిస్తున్న బహిరంగ మద్యపానాన్ని నియంత్రించాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎలమంచిలి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పట్టపగలు మద్యం సేవిస్తున్న మందుబాబులు

మద్యం కంపెనీల్లో తనిఖీలు

కశింకోట మండలం సుందరయ్యపేటలోని విశాఖ డిస్టిలరీలో సీఐడీ దాడులు

- ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కొనసాగిన సోదాలు
- పలు రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన
- కీలక రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు స్వాధీనం



సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించిన కశింకోట మండలం సుందరయ్యపేటలోని విశాఖ డిస్టిలరీ

(అనకాపల్లి/కశింకోట-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కశింకోట మండలం సుందరయ్యపేటలో వున్న విశాఖ డిస్టిలరీ (మద్యం తయారీ) కంపెనీలో సీఐడీ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఉదయం 9.30 గంటలకు మద్యం తయారీ కంపెనీలోకి ప్రవేశించిన అధికారులు.. అర్ధరాత్రి వరకు సోదాలు నిర్వహించారు. పలు రకాల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కీలక రికార్డులు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

వైసీపీ పాలనలో జరిగిన మద్యం అమ్మకాల అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు సీఐడీ దూకుడు పెంచింది. గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలు నాసిరకం మద్యం అమ్మకాల ద్వారా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని మద్యం తయారీ డిస్టిలరీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలు డిస్టరీల్లో సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని కశింకోట మండలం సుందరయ్యపేటలో వున్న విశాఖ డిస్టిలరీకి సీఐడీ అధికారుల బృందం ఉదయం 9.30 గంటలకు చేరుకుంది. సీఐడీ విశాఖ అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు చలపతిరావు, రమణమూర్తితోపాటు మరో 12 మంది అధికారులు తనిఖీలు చేపట్టారు. రాత్రి 11 గంటల సమయానికి కూడా సోదాలు కొనసాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన మద్యం తయారీ అనుమతులు, ఇతరత్రా లావాదేవీల రికార్డులను సీఐడీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిసింది. మద్యం తయారీ, సరఫరా, గోదాములో మద్యం నిల్వలకు సంబంధించి వివరాలను సేకరించినట్టు సమాచారం. రికార్డులను నిశితంగా పరిశీలించి కొన్నింటిని సీఐడీ అధికారులు తమ వెంట తీసుకెళ్లేందుకు ప్యాకింగ్ చేయించినట్టు చెబుతున్నారు. ఇంకా కంప్యూటర్ హార్డ్ డిస్కులు, నగదు లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో సీఐడీ అధికారులు డిస్టిలరీ ప్రధాన గేటును మూయించి, లోపలికి ఎవరినీ రానివ్వలేదు. తనిఖీల ఫొటోలు తీసేందుకు మీడియాకు కూడా అనుమతివ్వలేదు.

భోగాపురం బాదుషా...



- గ్రామీణ ప్రాంతంలో విపరీతమైన క్రేజ్
- పెళ్లిళ్లు, శుభకార్యాల్లో తప్పనిసరిగా వడ్డన
- విదేశాలకూ సరఫరా
- 50 ఏళ్లుగా అందరికీ ఇష్టమైన స్వీటుగా గుర్తింపు

- 8లో

హాస్టల్ విద్యార్థిపై కుక్ దాష్టీకం

భోజనం త్వరగా పెట్టాలని అడిగినందుకు కర్రతో విచక్షణారహితంగా దాడి

- మద్యం మత్తులో బాలుడిని తీవ్రంగా కొట్టిన వైనం
- భయంతో వణికిపోయిన ఇతర విద్యార్థులు
- అనకాపల్లి గాంధీనగరం డీఎన్‌టీ హాస్టల్‌లో ఘటన
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- వసతిగృహంలో సిబ్బంది పర్యవేక్షణ లేదని ఆరోపణ



విద్యార్థి హేమంత్ చేతిపై, వీపుపై గాయాలు

తుమ్మపాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణం గాంధీనగరంలోగల అనుసూచిత బాలుర వసతిగృహం (డీ-నోటిఫైడ్ ట్రైబ్స్-డీఎన్‌టీ హాస్టల్)లో ఆరో తరగతి విద్యార్థిపై హాస్టల్ కుక్ కర్రతో చితకబాదాడు. రెండు రోజుల క్రితం ఈ సంఘటన జరగ్గా.. మంగళవారం కుటుంబ సభ్యుల ఆందోళనతో వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.


హాస్టల్ కుక్ ముదపాక కుమార్

మండల కేంద్రమైన బుచ్చెయ్యపేటకు చెందిన శనివాడ హేమంత్ అనకాపల్లి పట్టణం గాంధీనగరంలోని డీఎన్‌టీ హాస్టల్‌లో ఉంటూ ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 20వ తేదీ ఆదివారం రాత్రి భోజనం సమయానికి కన్నా కొంచెం ముందుగా వచ్చిన హేమంత్ .. తనకు భోజనం వడ్డించాలని హాస్టల్ కుక్ ముదుపాక కుమార్‌ను అడిగాడు. అప్పటికే ఫూటుగా మద్యం సేవించిన కుమార్.. కర్ర తీసుకుని హేమంత్‌ను విచక్షణా రహితంగా కొట్టడం ప్రారంభించాడు. దీంతో ఇతర విద్యార్థులు బెంబేలెత్తిపోయి రూమ్‌లలోకి పరు గులు తీశారు. ఆ సమయంలో హాస్టల్ వార్డెన్, పర్య వేక్షకులు లేకపోవడంతో కుక్ కుమార్ ఇష్టారా జ్యంగా ప్రవర్తిం చాడు. తీవ్ర గాయలైన హేమం త్‌ను సోమవారం తోటి విద్యార్థులు అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళ వారం కుటుంబ సభ్యులకు సమాచారం అందిం చారు. దీంతో వారు హాస్టల్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. కుక్ తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కుక్ ముదపాక కుమార్‌ను సస్పెండ్ చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని, పర్యవేక్షణ లోపించిన హాస్టల్ వార్డెన్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హాస్టల్‌కుక్‌పై చర్యలు



అనకాపల్లి గాంధీనగరంలోని డీఎన్‌టీ హాస్టల్‌లో ఒక విద్యార్థిపై కుక్ దాడి చేసిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాం. కుక్ కుమార్ మద్యం మత్తులో విద్యార్థిపై దాడికి పాల్పడినట్టు నిర్ధారణ అయ్యింది. అతడిని సస్పెండ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హాస్టల్‌లో పర్యవేక్షణ లోపానికి బాధ్యులైన సిబ్బందిపైనా చర్యలు తీసుకుంటాం. - కె.రాజేశ్వరి, డిప్యూటీ డైరెక్టర్, బీసీ వెల్ఫేర్

అనకాపల్లిలో పారిశుధ్యం అధ్వానం

జీవీఎంసీ కమిషనర్ అసహనం

- డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు
- శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లపై ఆగ్రహం
- అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశం


పట్టణంలో పారిశుధ్యం సక్రమంగా లేదంటూ శానిటరీ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం అనకాపల్లి పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువల్లో పూడిక పేరుకుపోయి వుండడాన్ని గమనించారు. అన్నిచోట్లా డ్రైనేజీ కాలువల్లో పూడిక, వ్యర్థాలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన జోనల్ కార్యాలయం ఆవరణలోని కంపోస్టు యార్డును పరిశీలించారు మొబైల్ కాంపాక్టర్ షెడ్డు నిర్మాణం చేసి, క్లోజ్డ్ కాంపాక్ట్ విధానంలో చెత్తను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శంకరం వద్ద గల సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి, చుట్టు మొక్కలను నాటి అందంగా తీర్చిదిద్దాలన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో అగనంపూడి నుంచి అనకాపల్లి వరకు 500 ఎం.ఎం. వ్యాసార్థంతో జరుగుతున్న పైపు లైన్ నిర్మాణ పనులను డిసెంబరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. లక్ష్మీదేవిపేటలో 1000 కిలో లీటర్ల ఎలివేటడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఈఎల్ఎస్ఆర్) పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంను పరిశీలించిన ఆయన చివర దశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

అనకాపల్లిలో వీధి కుక్కలు అధికంగా వున్నాయని, వీటిని కట్టడి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించిన నిర్మాణాలకు టీడీఆర్‌లు వెంటనే మంజూరు చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏసీపీ రామకృష్ణను ఆదేశించారు. గుండాల వద్ద నిర్మాణంలో ఉన్న గెస్ట్‌హౌస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మంచినీటి సరఫరా విభాగాన్ని పరిశీలించిన కమిషనర్.. ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరును అందించాలని స్పష్టం చేశారు. ఆయన వెంట ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్ రాజు, పర్యవేక్షక ఇంజనీర్ రామ్మోహనరావు, డీడీహెచ్ దామోదరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు చిరంజీవులు, ఏడుకొండలు, శేఖర్, ఏపీడీ సంతోష్‌కుమార్ ఉన్నారు.

నదులకు తూట్లు

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- ప్రభుత్వం కల్పించిన 'స్థానిక' వెసులుబాటుతో మరింత రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ట్రైరు బండ్లతో పగటిపూట నదుల్లో ఇసుక తవ్వకాలు
- సమీపంలోని ఖాళీ స్థలాలు, తోటల్లో నిల్వ
- చీకటి పడిన తరువాత లారీల్లోకి లోడింగ్
- ఇతర ప్రాంతాలకు దర్జాగా రవాణా
- భారీగా సొమ్ము చేసుకుంటున్న ఇసుకాసురులు


పాతరోడ్డులో ఖాళీ స్థలంలో నిల్వ చేసిన ఇసుక

కోటవురట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో మార్పులు చేయడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. ప్రజల అవసరాల నిమిత్తం అధికారికంగా ఇసుక రీచ్‌లు లేని ప్రాంతాల్లో నదులు, గెడ్డల్లో ఇసుక తవ్వి తీసుకుపోవచ్చన్న వెసులుబాటును పలువురు దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను స్థానిక సచివాలయంలో అనుమతులు తీసుకుని ట్రైరు బండ్లు, ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం చెప్పగా, అక్రమార్కులు వీటి సహాయంతో కోటవురట్ల మండలం పందూరు, రామచంద్రపురం, కైలాసపట్నం పాతరోడ్డు, జల్లూరు ప్రాంతాల్లో వరహా, సర్పా నదుల్లో నుంచి ఇసుకను ఒడ్డుకు చేర్చి, రాత్రిపూట లారీల్లోకి లోడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏ ఒక్కరు కూడా ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేయడంలేదు. వ్యాపారులు నదుల్లో నుంచి ఇసుకను తోడేసి దర్జాగా అమ్ముకుంటున్నారు. పైగా ప్రభుత్వం ప్రకటించిన ధర కన్నా ఎక్కువ రేటుకు విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. తమ అక్రమ వ్యాపారానికి ట్రైరు బండ్ల యజమానులను పావులుగా వాడుకుంటున్నారు. ట్రైరు బండి ఇసుకకు (సుమారు టన్నున్నర) రూ.500 నుంచి రూ.750 వరకు చెల్లించి, సమీపంలోని తోటలు, ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేయిస్తున్నారు. చీకటి పడిన తరువాత లారీలు, టిప్పర్లలోకి లోడింగ్ చేసి ఇసుక లభ్యత లేని ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. లారీలో పది నుంచి 12 టన్నుల వరకు ఇసుక పడుతుంది. దీనిని రూ.15 వేలకు అమ్ముతున్నారు. ఈ లెక్కన ట్రైరు బండ్ల యజమానులకు, లోడింగ్ కూలీలకు చెల్లించగా ఒక లోడు ఇసుకపై రూ.6-7 వేలు సంపాదిస్తున్నారు. వరహా, సర్పా నదులకు ఇరువైపుల వున్న గ్రామాల్లో కొంతమంది స్థానిక రాజకీయ నాయకులకు ఇసుక వ్యాపారం ఒక ప్రధాన ఆదాయ వనరుగా మారింది. రామచంద్రపురంలో నదిలో నుంచి ట్రైరు బండ్లతో తీసుకువచ్చిన ఇసుకను భారీ రక్షిత మంచినీటి పథకం సమీపంలోని మామిడి తోటల్లో నిల్వ చేస్తున్నారు. పాతరోడ్డు, పందూరు, రాజుపేటల్లో కూడా ఇదే తరహాలో ఇసుక తవ్వకాలు, అమ్మకాలు సాగుతున్నాయి.


రామచంద్రపురంలో నిల్వచేసిన ఇసుకను చీకటి పడిన తరువాత లారీకి లోడింగ్ చేస్తున్న దృశ్యం

ఎన్ఏవోబీ భూములకు శాశ్వత పరిష్కారం చూపించాలి

- అధికారులను అడ్డుకున్న బంగారమ్మపాలెం మత్స్యకారులు
- వెనుదిరిగిన రెవెన్యూ, పోలీస్ అధికారులు

ఎస్.రాయవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారమ్మపాలెం ఎన్ఏవోబీకు చెందిన భూములను అప్పగించడానికి మంగళ వారం వచ్చిన అధికారులను స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. తహసీల్దార్ రమేష్ బాబు, మండల సర్వేయర్ త్రిమూర్తి, సిబ్బంది, పోలీసు బృందంతో అధికారులు వెళ్లగా ఎన్ఏవోబీ నిర్మాణ సమయంలో ఇచ్చిన హామీలతో పాటు చేపల వేటకు సంబంధించిన జట్టీ నిర్మాణం, తదితర సమస్యలను నెరవేర్చిన తర్వాత భూములను అప్పగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేశారు. దీంతో అధికారులు ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారుల సమస్యలపై మాట్లాడేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం బంగారమ్మపాలెం మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఇందులో సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

అభిజిత్ లేఆఫ్ ఎత్తివేయాలని సీఐటీయూ ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, అక్రమ లేఆఫ్‌ను ఎత్తివేయాలని పట్టణంలో సీఐటీయూ ప్రతినిధులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. శివాజీ మాట్లాడుతూ అక్రమ లేఆఫ్‌ను ఎత్తివేసి కార్మిక చట్టాలు పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేయాలన్నారు. పరిశ్రమను వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజు, కూర్మారావు, హనుమంతు, సూరిబాబు పాల్గొన్నారు.

శానిటేషన్, క్లోరినేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎంపీడీవో సీతారామరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు డయేరియా, అతిసారం ప్రబలకుండా శానిటేషన్, క్లోరినేషన్ పనులు ముమ్మరం చేపట్టాలని ఎంపీడీవో డి. సీతారామరాజు ఆదేశించారు. మురికికాలువలను శుభ్రం చేయాలని, సంపద కేంద్రాలున్నచోట సకాలంలో తడి, పొడి చెత్తను సేకరించి తరలించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పలువురు సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆర్డీవో దృష్టికి కారిడార్ నిర్వాసిత రైతుల సమస్యలు


ఆర్డీవో రమణతో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణను కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రమణను రైతులతోపాటు కొప్పిశెట్టి వెంకటేశ్ కలిశారు. కారిడార్ నిర్వాసిత రైతులకు సంబంధించి ఆర్ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం, పునరావాసం తదితర అంశాల గురించి మాట్లాడారు. తహసీల్దార్ నర్సింహమూర్తి, పలువురు రైతులు పాల్గొన్నారు.

వరిలో సుడిదోమ నివారణకు సస్యరక్షణ చర్యలు

నక్కపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు, కాగిత గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా వ్యవసాయశాఖాధికారులు క్షేత్ర పర్యటన చేశారు. వరిలో సుడిదోమ వున్నట్టు గుర్తించారు. దీని నివారణకు ఎటువంటి సస్యరక్షణ చర్యలు చేపట్టాలో ఏవో ఉమాప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. దోమకు మందు కొట్టేటప్పుడు పొలం చుట్టూ గట్లు ఆనుకుని ముందుగా పిచికారీ చేయాలన్నారు. క్షేత్ర పర్యటనలో ఏఈవో సత్యనారాయణ , సర్పంచ్ నూకరత్నం, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

ఎస్.రాయవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని వమ్మవరం ఫీడర్‌లో వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలకు బుధవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అనకాపల్లి ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూతన లైన్ల ఏర్పాటు పనుల్లో భాగంగా విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాగిత దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నక్కపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ


ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

ఎస్.రాయవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం రాజ్‌కమల్, వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు కుసుమకుమారి, విమలాదేవి, శోభారాణి, ఆర్ అప్పలనాయుడు, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

దినదిన గండం!

శిథిలావస్థకు వెల్చూరు ప్రాథమిక పాఠశాల భవనాలు

- భవనాల శ్లాబ్, గోడలు, స్తంభాల నుంచి పడుతున్న పెచ్చులు
- ఆందోళనలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు
- వర్షం వస్తే కారిపోతున్నాయని ఆవేదన
- నూతన భవనాలు నిర్మించాలని వేడుకోలు


శిథిలావస్థకు చేరుకున్న వెల్చూరు ప్రాథమిక పాఠశాల భవనం


శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి కనిపిస్తున్న ఇనుప ఊసలు


దెబ్బతిన్న పాఠశాల స్తంభాలు

రాంబిల్లి, అక్టోబరు 22: మండలంలోని వెల్చూరు ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్రభుత్వ రెండు భవనాలు పూర్తిగా దెబ్బతిని, ఏ సమయంలోనైన కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఒకటి నుంచి 5 తరగతుల విద్యార్థులు ఈ శిథిల భవనాల్లోనే భయపడుతూనే చదువుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాల శ్లాబు పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. భవనాల గోడలు బీటలు వారిపోతున్నాయి. భవనాల స్తంభాలు, కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం కురిసినప్పుడల్లా గదుల్లోకి నీరు చేరుతున్నదని ఉపాధ్యాయులు, విద్యార్థులు చెబుతున్నారు. ఉన్న రెండు భవనాల్లో ఒక భవనం గది కొంతమేరకు కారడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వర్షం పడినప్పుడల్లా నానిపోయి శ్లాబ్ పెచ్చులు ఊడిపోయి పిల్ల మీద పడిపోతున్నాయి. వరండాలోనే బిక్కుబిక్కుమంటూ తరగతులు నిర్వహిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. భవనాల దుస్థితి అధ్వానంగా ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ భవనాలకు మరమ్మతుల చేసినా ఉపయోగం ఉండదని, కొత్త భవనాలను నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పలుమార్లు ఈ గ్రామ సందర్శనకు వచ్చిన పాలకులు, అధికారులకు భవనాల దుస్థితిని తెలియజేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ స్పందించి శిథిల భవనాలను తొలగించి, కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వెల్చూరు పెద్దలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రూ. 3 కోట్లతో యానాద్రి కాలువ ఆధునికీకరణ

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన యంత్రాంగం
- రూ.60 కోట్లతో అండర్ డ్రైనేజీ వ్యవస్థ
- పరిశీలించిన ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్‌పర్సన్


యానాద్రి కాలువ ఆధునికీకరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండున్నర కిలోమీటర్లు విస్తరించి ఉన్న యానాద్రి కాలువను రూ.మూడు కోట్లతో ఆధునీకరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈనెల 21వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'ఎలమంచిలిలో డ్రైనేజీలు అధ్వానం' అన్న శీర్షికతో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం మునిసిపల్, నీటిపారుదల శాఖ, పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ యానాద్రి కాలువను పరిశీలించారు. కొత్తపేట కాలనీ లొట్లవీధిలో కాలువను పరిశీలించారు. అక్కడే ఇంజనీరింగ్ అధికారుల రూపొందించిన మ్యాప్ పాయింట్‌ను చూసి, ఇంజనీరింగ్ అధికారులకు మరిన్ని సూచనలు అందించారు. యానాద్రి కాలువను అన్ని విధాలా అభివృద్ధి పరిచి ప్రజలకు సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కాలువ పనులకు నిధులు మంజూరైన వెంటనే ఏ ప్రాంతం నుంచి పనులు ప్రారంభించాలన్న దానిపై అధికారులతో చర్చించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం నివేదికలు రూపొందించమని ఆదేశించారు. మునిసిపాలిటీలో రూ.60 కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి, మునిసిపల్ ప్రజలకు సమస్య లేకుండా చేస్తామన్నారు. మునిసిపాలిటీలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని, ప్రజలందరినీ భాగస్వాములను చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మునిసిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చిన ఏ సమస్యలను పరిష్కరించారో ఎమ్మెల్యే సుందరపుకు అధికారులు వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కూటమి నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, రాజాన శేషు, కొఠారు శ్రీను, ఆడారి రమణబాబు, కొఠారు నరేష్ పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నీలో ఎలమంచిలి జట్టుకు రజత పతకం

- జాతీయ పోటీలకు ఇద్దరు క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులతో ఎలమంచిలి డిగ్రీ కళాశాల అధ్యాపకులు

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నీలో ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు రజత పతకం సాధించింది. దీంతో క్రీడాకారులు, పీడీ పోలిరెడ్డిలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు. ఈనెల 16వ తేదీ నుంచి ఏయూ మైదానంలో నిర్వహించిన అంతర్ కళాశాలల కబడ్డీ టోర్నీలో ఎలమంచిలి క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించడం కళాశాల చరిత్రలో ఇదే ప్రథమమని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ టోర్నీలో ప్రతిభ కనబరిచిన పి. గోపి, కె.జగదీష్ జాతీయ స్థాయిలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈ విజయానికి ప్రత్యేక కారణమైన ఫిజికల్ డైరెక్టరు డాక్టర్. వై.పోలిరెడ్డిని అభినందించారు.

జిల్లాలో నాలుగు సబ్‌ట్రెజరీలకు కొత్త భవనాలు


కోటవురట్ల ట్రెజరీ భవనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఎస్‌టీవో

కోటవురట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో కొత్తగా నాలుగు సబ్ ట్రెజరీ కార్యాలయ భవనాలు మంజూరు అయినట్టు జిల్లా ట్రెజరీ ఆఫీసర్ సుభాషిని తెలిపారు. మంగళవారం ఇక్కడ కొత్తగా నిర్మిస్తున్న సబ్ ట్రెజరీ కార్యాలయం నూతన భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రస్తుతం కోటవురట్ల, నర్సీపట్నం, నక్కపల్లి, అనకాపల్లి ఈస్ట్‌జోన్ కార్యాలయాలకు కొత్తగా భవనాలు మంజూరైనట్టు ఆమె తెలిపారు. కోటవురట్ల, నర్సీపట్నం సబ్‌ట్రెజరీల కొత్త భవనాల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు.అనకాపల్లి కొత్త భవనం నిర్మాణానికి స్థలం లేదన్నారు. నక్కపల్లిలో కొత్త భవనం నిర్మాణానికి టెక్నికల్ ప్రాబ్లమ్ వల్ల పనులు ప్రారంభం కాలేదన్నారు. కోటవురట్లలో కొత్త భవనం జనవరి నాటికి పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు.

పలు పంచాయతీల రికార్డులు పరిశీలన

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ పంచాయతీలను మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎస్ఎన్ మూర్తి సందర్శించారు.ఏటికొప్పాక, పోతిరెడ్డిపాలెం, బయ్యవరం పంచాయతీల రికార్డులను పరిశీలించారు. సంపద కేంద్రాలను పరిశీలించి, సెక్రటరీలకు పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి దీపికా, కార్యదర్శులు రామకోటి, డి, సత్యనారాయణ, కేఎస్‌కేఎస్, ప్రసాద్ పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను పరిశీలించిన జిల్లా కో-ఆర్డినేటర్

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపురం గ్రామ పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని మంగళవారం పంచాయతీ వనరుల కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించేలా సంపద కేంద్రాల నిర్వహణ ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 60 పశువులకు పరీక్షలు

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని సోమలింగపాలెంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని చైర్‌పర్సన్ రమాకుమారి, స్థానిక నేత కర్రి శివ ప్రారంభించారు. శిబిరంలో 60 పశువులకు గర్భకోశ పరీక్షలు, 23 పెయ్యిలకు నట్టల నివారణ మందులు వేసినట్టు పశువైద్యశాల సహాయ సంచాలకులు గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖాధికారి రామ్మోహన్‌రావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ బెహరా ప్రసాద్, జిల్లా ఉపసంచాలకులు చంద్రశేఖర్, స్థానిక వైద్యులు, భానుబాబు, జె.పద్మజ, కూటమి నేతలు యల్లపు గోపి, ఝాన్సీ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభల్లో అర్జీలకు సత్వర పరిష్కారం

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ జీవీజీ జనార్దన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకర్లపూడి కుమార సీతారామరాజు, ఆర్ఐ సోమేష్‌కుమార్, వీఆర్ఓ శశి, సర్వేయర్ దిలీప్ పాల్గొన్నారు.

సచివాలయ రికార్డుల పరిశీలన

పాయకరావుపేట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరం అరట్లకోట గ్రామ సచివాలయాలను మంగళవారం ఈవోపీఆర్డీ చంద్రశేఖరరావు సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం అరట్లకోటలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. కార్యదర్శి మల్లికార్జునాచారి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరి పంట పొట్ట దశలో ఉన్నందున రైతులంతా యాజమాన్య పద్ధతులు అవలంబించాలని వ్యవసాయాధికారి మోహనరావు అన్నారు. మంగళవారం లైనుకొత్తూరు, యర్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదితో పోల్చితే ఈ ఏడాది తెగుళ్ల తీవ్రత తక్కువగా ఉందన్నారు. వరి పంట పొట్ట దశలో ఉన్నందున పొటాష్ ఎరువు తప్పకుండా ఎకరానికి 30 నుంచి 40 కేజీలు, 15 నుంచి 20 కేజీల యూరియాతో కలిపి వేయాలని లేదా పొటాష్ లోపం ఉన్నట్టయితే 13-0-45 ఎకరానికి ఒక కేజీ పాకెట్ స్ప్రే చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దివ్య, అభ్యుదయ రైతు సోమునాయుడు, నారాయణమ్మ, రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వయోజనులకు విద్యాబోధన

పాయకరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులైన వయోజనులకు విద్య నేర్పించి, వారిలో ఆర్థిక, సామాజిక చైతన్యం తేవడమే ఉల్లాస్ పథకం లక్ష్యమని ఎంపీడీఓ జయప్రకాశరావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పీఆర్, విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ, ఐసీడీఎస్, ఎంజీఎన్ఆర్‌జీఎస్, వెలుగు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత మండలంలో వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీల లో పనిచేస్తున్న నిరక్షరాస్యులైన కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు తమ వద్ద పనిచేస్తున్న నిరక్షరాస్యులైన కింది స్థాయి సిబ్బంది వివరాలను తెలియజేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ కేఎస్.గాంధీ, ఈవో పీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, ఏఓ వర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం సామిల్‌ను తనిఖీ చేసిన విజిలెన్స్ డీఎఫ్‌వో


కోటవురట్ల సామిల్‌లో తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ డీఎఫ్‌వో

కోటవురట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామంలోగల శ్రీదుర్గా భవానీ సామిల్‌ను విశాఖ జిల్లా విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మారక్షిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సామిల్‌లో అనుమతులతో కూడిన కలప ఉన్నదా లేదా అని రెండుగంటలపాటు పరిశీలించారు. రికార్డుల్లో ఉన్న కలప హెచ్చు తగ్గులను పరిశీలించారు. ఎటువంటి తేడాలు కనిపించలేదు. ఆయన వెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసరు శంకరయ్య, ఫారెస్ట్‌సెక్షన్ ఆఫీసర్ ప్రసాద్, స్థానిక ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

జనం సంచరించే ప్రదేశంలో వంగి ఉన్న స్తంభాలు

ఎప్పుడు కూలిపోతాయోనని ఆందోళన

పట్టించుకోని ఈపీడీసీఎల్ అధికారులు


ఏటికొప్పాక బజారువీధిలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ఎలమంచిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నిత్యం ప్రజలు సంచరించే ప్రధాన జంక్షన్ల వద్ద వంగి ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ విద్యుత్ స్తంభాల కారణంగా ప్రమాదం చోటుచేసుకుంటే ఎవరిది బాధ్యత అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏటికొప్పాక మార్కెట్ వీధిలో నిత్యం జనంతో రద్దీగా ఉండే రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం వంగి ఉంది. గతంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో విద్యుత్ స్తంభం వంగిపోయింది. దీనిని మార్చేందుకు ఈపీడీసీఎల్ అధికారులు చొరవ చూపలేదు. ఏళ్ల తరబడి ఈ స్తంభాన్ని పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా జంపపాలెంలోని ప్రధాన రోడ్డు పక్కన ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం పరిస్థితి ఇదే విదంగా ఉంది. ఏళ్ల తరబడి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేయడంలో ఈపీడీసీఎల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రమాదవశాత్తూ స్తంభాలు కూలిపోయి ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యతని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అంతకుముందే విద్యుత్ స్తంభాన్ని మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తెరుచుకోని వ్యవసాయ కార్యాలయం

- ఇబ్బంది పడుతున్న రైతులు
- ఏవో, సిబ్బంది జాడ లేదు..
- చర్యలు తీసుకోవాలని రైతుల వేడుకోలు


అచ్యుతాపురంలో మూసి ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ శాఖ కార్యాలయం గత రెండు రోజులుగా తెరవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా ఏ సమయానికి వెళ్లినా తలుపులకు తాళాలు వేసే ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం పది నుంచి 12 గంటల వరకు వివిధ గ్రామాల నుంచి రైతులు వ్యవసాయ కార్యాలయానికి వస్తున్నారు. తలుపులు తెరవకపోవడంతో కొంతసేపు చూసి వెళ్లిపోతున్నారు. రెండు రోజులుగా తాను కార్యాలయానికి వస్తున్నా మూసి ఉంటుందని, కొంతసేపు ఉండి తిరిగి వెళ్లిపోతున్నానని దోసూరుకి చెందిన రామారావు అనే రైతు వాపోయాడు. ఫోన్ చేసినా రింగ్ అవుతోంది గాని ఎత్తడం లేదని చీమలాపల్లికి చెందిన సూరిబాబు అనే రైతు తెలిపారు. కార్యాలయం పక్కనే మోసయ్యపేట పంచాయతీ కార్యాలయం ఉంది. అక్కడ వాకబు చేస్తే వ్యవసాయ కార్యాలయానికి ఎవరూ రావడం లేదని తెలిపారని తంతడికి చెందిన వెంకటరావు అనే రైతు తెలిపారు. వ్యవసాయాధికారి లేకపోయినా సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా వుండాలి

నక్కపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో తుఫాన్ తక్షణ చర్యలపై పలు ఆదేశాలు జారీచేశారు. రానున్న నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని, తీర ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో వుండాలని ఆదేశించారు.

తుఫాన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ జీవీజీజనార్దన్ తెలిపారు. తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మండలంలో తీర ప్రాంత గ్రామాలైన తంతడి, వాడపాలెం, పూడిమడకల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 70937 73914కి ఫోన్ చేయాలన్నారు. మత్స్యకారులెవరూ వేటకు వెళ్లకూడదన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అచ్యుతాపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ డీఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూడిమడక, పెదపాడు, కొండపాలెం, కడపాలెంలలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

మునగపాక (తుమ్మపాల), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునగపాకలోని అమ్మ చౌకబజార్ వస్త్ర దుకాణంలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగి వస్త్రాలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి దుకాణం యజమానురాలు పెతకంశెట్టి పూజిత అందించిన వివరాలిలా ఉన్నాయి. ప్రతి రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం వస్త్ర దుకాణాన్ని తెరిచి వ్యాపార లావాదేవీలు సాగించడం జరిగిందన్నారు. మధ్యాహ్నం భోజన విరామంలో షాపు మూసి స్వగ్రామమైన వాడ్రాపల్లి వెళ్లామన్నారు. కొంతసేపటికే దుకాణంలోంచి పొగలు వస్తున్నాయని సమాచారం అందడంతో చేరుకొని షాపు తెరవగా వస్త్రాలు అగ్నికి ఆహుతి అయ్యాయన్నారు. ముద్ర రుణం తీసుకుని వ్యాపారాన్ని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో జరిగిన ప్రమాదం తీవ్ర నష్టాన్ని కలిగించిందని చెప్పారు. ఘటనకు సంబంధించి మునగపాక ఎస్‌బీఐ మేనేజర్‌కు సమాచారం అందజేయడంతో సిబ్బంది వచ్చి పరిశీలించారని చెప్పారు. తనను ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు.

గంజాయి కేసులో మరో ఇద్దరి అరెస్టు

నక్కపల్లి, అక్టోబరు 22: మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద ఇటీవల గంజాయి పట్టుబడిన కేసులో మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ కుమారస్వామి తెలిపారు. ఈనెల 19వ తేదీన కారులో తరలిస్తున్న 146 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని మహారాష్ట్రకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరికి గంజాయి సరఫరా చేసిన అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం చీడిపట్టు గ్రామానికి చెందిన చంద్రబాబు, దేగలపుట్టు గ్రామానికి చెందిన పాంగి నరేశ్‌లను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ కుమారస్వామి చెప్పారు.


పట్టణ సీఐ, నాయకులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోండి

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన గోవిందరావు మంగళవారం స్పీకర్‌ను మర్యాదపూర్వంగా కలవడానికి వెళ్లారు. ఈ సందర్భంగా సీఐతో పాటు పార్టీ నాయకులతో అయ్యన్న మాట్లాడారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సీఐను ఆదేశించారు. ఇందుకు అందరూ సహకరించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో రాజీ పడవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యన్న స్పష్టం చేశారు.రు.

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి


సబ్ జైలును సందర్శిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

నర్సీపట్నం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ ఇక్కడి సబ్ జైలును మంగళవారం సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలపై సబ్ జైల్ సూపరింటెండెంట్ సన్యాసిరావుతో మాట్లాడి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న న్యాయ సహాయం, వైద్య సేవలు, భోజన సదుపాయం తదితర అంశాలను పరిశీలించారు. శిక్షా కాలంలో పరివర్తన చెందిన మంచి నడవడికతో నూతన జీవన విధానాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలకు సూచించారు.

సాగునీటి కాలువ మరమ్మతుకు నిధులు మంజూరు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగారంపేట సాగునీటి కాలువ, కల్వర్టు, గేటు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసినట్టు జల వనరుల శాఖ జేఈఈ రుత్తల రవికిరణ్ తెలిపారు. పాతకృష్ణాదేవిపేట, సిహెచ్.నాగాపురం, కొంగసింగి గ్రామాల్లో సాగునీటి కాలువలను జడ్పీటీసీ మాజీ సభ్యుడు తారక వేణుగోపాల్, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు దృష్టి తీసుకువెళ్లడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. కాగా, గత ఐదేళ్ల వైసీపీ పాలకులు సాగునీటి కాలువలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరాయని వేణుగోపాల్ ఆరోపించారు.

పది కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాల ప్రకారం... చింతపల్లి మండలం చెరుకుంపాకలకు చెందిన టెడ్ల కుమారి, పెద అయ్యంగారి మధుసూదనరావు, కిన్నెర్ల గ్రామానికి చెందిన కొర్రా అజయ్‌కుమార్ పది కిలోల గంజాయిని తుని రైల్వే స్టేషన్‌కు తరలించడానికి నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నీలంపేట రోడ్డులో సిద్ధంగా ఉన్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

▸ ఆరేళ్లుగా కొనసా...గుతున్న నిర్మాణాలు ▸ చిన్నారుల ఇక్కట్లు.. పట్టని అధికారులు

గొలుగొండ మండలంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఆరేళ్లుగా ఇవి నిర్మాణ దశలోనే ఉన్నాయి. వీటిని పట్టించుకునే నాథులే లేకపోవడంతో ఎప్పటికి పూర్తవుతాయోనన్న ప్రశ్నార్థకంగా మారింది. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కృష్ణాదేవిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగసింగి, చోద్యం, సిహెచ్.నాగాపురం తదితర గ్రామాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం కొత్త భవనాలు మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు కేటాయించింది. ఈ


చోద్యంలో ఐదేళ్లుగా పూర్తికాని అంగన్‌వాడీ భవనం

నిధులతో భవన నిర్మాణాలు ప్రారంభించి కాంట్రాక్టర్లు వివిధ దశల్లో పనులు చేపట్టారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భవన నిర్మాణాలను సంబంధిత కాంట్రాక్టులు మధ్యలోనే నిలుపుదల చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఈ భవనాలు పురోగతి సాధించడం లేదు. ఫలితంగా లక్షలాది రూపాయలు వెచ్చించిన నిర్మించిన భవనాలు నిర్మాణాలు ప్రారంభించకుండానే శిథిలమవుతున్నాయి. వీటితో పాటు ఏఎల్.పురం, గైరంపేట తదితర గ్రామాల్లో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలకు నిధులు కొరతతో మూడు నెలలుగా మధ్యలో నిలిచిపోయాయి. కొత్త భవనాల్లోకి వెళ్దామనుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, చిన్నారులకు సొంత గూడు కల నెరవేరడం లేదు. గత్యంతరం లేక అద్దె భవనాల్లోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ కాలం నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని చిన్నారులు తల్లిదండ్రులు కోరుతున్నారు.


కొంగసింగిలో తుప్పల మధ్య అసంపూర్తిగా ఉన్న భవనం

పరిశుభ్రత పాటించాలి

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించాలని ఏఎస్‌డబ్ల్యూవో శ్యామల సూచించారు. తన కార్యాలయ పరిధిలోని 12 వసతిగృహ సంక్షేమ అధికారులతో ఫుడ్ పాయిజన్ జరక్కుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో ఫుడ్ పాయిజన్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితిలోనూ మిగిలిన ఆహారం వేడి చేసి ఇవ్వవద్దని సూచించారు. అనంతరం వంట సిబ్బందికి ఎప్రాన్స్ పంపిణీ చేశారు.

'గబ్బాడ ఇసుకకు రవాణా చార్జీల వసూలు సరికాదు'

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గబ్బాడ ఇసుక రవాణాకు చార్జీలు వసూలు చేయడం సరికాదని జైభీం రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పి టన్నుకు రూ.1165 వసూలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. దీంతో వినియోగదారులపై తీవ్ర భారం పడుతున్నదని వాపోయారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని విన్నవించారు.

అగ్రి సెట్‌లో బీఆర్ కళాశాల విద్యార్థినికి 48 ర్యాంకు

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అగ్రిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంకు సాధించిన బీఆర్ అగ్రి కల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని ఎస్.జ్యోతిని కళాశాల ప్రిన్సిపాల్ సరేష్ అభినందించారు. మంగళవారం విద్యార్థినికి రూ.5 వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కార్తీక్ మాట్లాడుతూ ర్యాంకు సాధించడంతో అధ్యాపకుల కృషి ఎంతైనా ఉందని చెప్పారు.

బస్ షెల్టర్ లేక విద్యార్థుల అవస్థలు

మాకవరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొండలఅగ్రహారంలో బస్ స్టాప్ లేకపోవడంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్ ఉండగా, దాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనికితోడు రహదారులకు అనుకుని ఉన్న ఆర్అండ్‌బీ స్థలంలో ప్రవేటు షాపులు ఏర్పాటు చేయడంతో రోడ్డుపై విద్యార్థులు నిలిచి ఉండేందుకు తీవ్ర ఇబ్బందులు డపుతున్నారు. బస్సు ఆగడానికి కూడా స్థలం లేకుండా అక్రమణలు చేయడంతో విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టీసీ, అర్అండ్‌బీ అధికారులు స్పందించి అక్రమణదారులపై తగిన చర్యలు తీసుకోవాలని, బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.


కొండలఅగ్రహారం బస్టాండ్ లేక రోడ్డుపై బాలికలు వేచిఉన్న దృశ్యం

ఘనంగా నల్లగొండమ్మ జాతర

నాతవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం గుమ్మిడిగొండ గ్రామంలో మంగళవారం నల్లగొండమ్మ జాతర ఘనంగా జరిగింది ఉదయం ఆరుగంటల నుంచే భక్తులు క్యూలో నిలుచుని అమ్మవారి దర్శనాలు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నల్లగొండమ్మ పండగను పురస్కరించుకుని గ్రామంలో కోలాటం, వీధి డాన్స్‌లతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన బంధువులతో గుమ్మిడిగొండ గ్రామంలో ప్రత్యేక సందడి నెలకొంది. గ్రామంలో భారీ స్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేశారు మంగళవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటరమణ సిహెచ్.ప్రశాంత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించండి

నాతవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ కోరారు. పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణతో కలసి మంగళవారం తహసీల్దార్‌ను కలిసి భూ సమస్యలపై చర్చించినట్టు చెప్పారు. ఈ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరామన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు లేకపోవడంతో రైతుభరోసా డబ్బులు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఈ సమస్యలను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారన్నారు.

రీ సర్వేలో తప్పుల సవరణకు 40 దరఖాస్తులు

గొలుగొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వేలో దొర్లిన తప్పులను సవరించేందుకు 40 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని నల్లంకి రెవెన్యూ గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ చైన్లు, వీఆర్‌వో పడాల్, సర్పంచ్ పత్తి రమణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఏఎల్.పురం విద్యార్థుల ఎంపిక

కృష్ణాదేవిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏఎల్.పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పీడీలు టీవీ రమణ, జి.మాధవి తెలిపారు. నర్సీపట్నంలో ఆదివారం జరిగిన రెజ్లింగ్-పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి పోటీల్లో ఎం.హేమకిరణ్ (వెయిట్ లిఫ్టింగ్), ఎస్.రామచరణ్ (పవర్‌లిఫ్టింగ్) ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ పోటీలకు ఎంపికయ్యారన్నారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లగుడు రాజులనాయుడు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

చెరువుల పరిరక్షణకు హైడ్రా వంటి చట్టం కావాలి

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చెరువుల పరిరక్షణకు హైడ్రా వంటి చట్టం అవసరమని చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిచర్ల కృష్ణంనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందించారు. అనేక ప్రాంతాలలో చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, తెలంగాణ మాదిరి హైడ్రా వంటి చట్టాన్ని తీసుకువచ్చి చెరువులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పులిగా రామ్మోహన్ మురళి, దేవిపల్లి సీతారాం, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మాకవరపాలెం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

ఉచిత బస్సు హామీ అమలుచేయాలి

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోస్టుకార్డు ఉద్యమంతో నిరసన తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఉచిత బస్సు హామీని కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకురాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నింగిన రమణ, సిద్ధ, చినబాబు పాల్గొన్నారు.

లోవోల్టేజి సమస్యపై గోవాడలో ఆందోళన


గోవాడలో ఆందోళన నిర్వహిస్తున్న స్థానికులు

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవాడ పంచాయతీలో లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలంటూ పంచాయతీ వాసులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. లోవోల్టేజి సమస్య వల్ల ఇంట్లో విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, బల్బులు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులకు సమస్య గురించి ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందన ఉండడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి లోవోల్టేజి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉపసర్పంచ్ నక్కా త్రివేణి, వార్డు సభ్యులు శానాపతి శ్రీనివాసరావు, అర్జునరావు, లక్ష్మణ, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి'

బుచ్చెయ్యపేట అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎలమంచిలి డిప్యూటీ డీఈవో బి. అప్పారావు సూచించారు. మంగళవారం ఆయన తురకలపూడి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని ఆయన రుచి చూశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఏ సబ్జెక్టు ఎంత వరకూ వచ్చిందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవోలు కాశీవిశ్వేశ్వరరావు,. బొంజుబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ బద్ది తాతాజీ పాల్గొన్నారు.

'ప్రకృతి సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలి'

కె.కోటపాడు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ అన్నారు. మంగళవారం కొరువాడ గవరపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన వరి పంటను పరిశీలించారు. వరికి ఆశించిన తెగుళ్లను చూశారు. రైతులు వాడుతున్న పురుగు మందులను పరిశీలించి, వాటిని విధానం వివరించారు. కార్యక్రమంలో సింగంపల్లి నారాయణమూర్తి, చీపురుపల్లి అచ్చిబాబు, తోట భవాని, శిమ్మ నూకరత్నం, రేవతి, గణేష్ పాల్గొన్నారు.

నాలుగు కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

చీడికాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుపురం చెరకు తూనిక కేంద్రం వద్ద నాలుగు కిలోల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.సతీశ్ మంగళవారం తెలిపారు. అప్పలరాజుపురం కాటా వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా ముంచంగిపుట్టులో నాలుగు కిలోల గంజాయి కొనుగోలు చేసి కోనాం మీదుగా అప్పలరాజుపురానికి తమిళనాడుకు చెందిన అశ్విన్‌సోలోమన్ వచ్చాడు. అక్కడ ఆటో కోసం ఎదురుచూస్తుండగా పోలీసులు తనిఖీల్లో గంజాయి పట్టుబడిందన్నారు. అతనిని అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. గంజాయితోపాటు రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన అవసరం

దేవరాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ.రమణ అన్నారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో చట్టాలు, భారత రాజ్యాంగంపై అవగాహన కలిగించారు. ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కె.శ్రీను, ప్రిన్సిపాల్ రాధ తదితరులు పాల్గొన్నారు.

గర్నికం, పెదపాచిలల్లో పొలం పిలుస్తోంది

రావికమతం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం, పెదపాచిల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారిణి రూప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీదేవి, జిల్లా వనరుల శాఖ అనకాపల్లి ఏడీ పి.శ్రీధర్, విజేత తదితరులు పాల్గొని పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ వంశీప్రియ తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో మోడల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్

▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మోడల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఆర్. గోవిందరావుతో కలిసి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్న స్థానిక వెలుగు కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి కోర్సులలో శిక్షణ ఇవ్వడంతోపాటు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అసంపూర్తిగా ఉన్న రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, రెవెన్యూ కార్యాలయం నిర్వహిస్తున్న మహిళా వికాస భవనాన్ని తిరిగి వెలుగు కార్యాలయానికి అప్పగించనున్నట్టు ఆయన తెలిపారు. అంకుపాలెం రోడ్డులో వెలుగు కార్యాలయం, శిథిలావస్థలో ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ భవనాల స్థానంలో మోడల్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ రత్నప్రభ, ఏపీఎం తిలక్, పీఆర్ ఏఈ శాంతారాం పాల్గొన్నారు.


ఫ్యాషన్ టెక్నాలజీ భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అని మాడుగుల ఎమ్మెల్యే బండారు.సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం గరిశింగి, మారేపల్లి, చిన నందిపల్లి, వేచలం, ఎస్.గజపతినగరం, ముషిడిపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రైవాడ నీటిని రైతులకు అంకితం చేస్తానని, తాగు నీరు, సాగునీటికి ఎటువంటి సమస్య లేకుండా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. గర్శింగిలో చెక్‌డ్యాం, తాగునీటి సమస్యలు, మారేపల్లిలో విద్యుత్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామాల్లో శ్మశానాల్లో సౌకర్యాలు కల్పిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రునాయుడు, జనసేన నాయకుడు కృష్ణ, రామ్మూర్తినాయుడు, పెద్దాడ వెంకటరమణ, అవుగడ్డ.రమాదేవీ, పెంటకోట అప్పలనాయుడు, మండల అధికారులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

సీఎం దృష్టికి ప్రైవేటు డిగ్రీ కళాశాలల సమస్యలు

▸ సంఘం ఉపాధ్యక్షుడు రమణాజీ


సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నిర్వాహకుల సంఘం ప్రతినిధులు సోమవారం సీఎం చంద్రబాబును కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిర్వాహకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రమణాజీ విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు డిగ్రీ కాలేజీల సమస్యల పట్ల సీఎం సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల సంఘం తరపున రూ. 45.2 లక్షల విరాళాన్ని వరద బాధితుల సహాయార్థం అందజేశామని రమణాజీ తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 22: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. అవాంఛనీయ ఘటనలు ఎదుర్కొవడానికి ప్రత్యేకాధికారులను నియమించారు. ప్రజలు కంట్రోల్ రూమ్ ఫోన్ నంబరు 7386009882 సంప్రదించాలన్నారు. మంగళాపురం, విజయరామరాజుపేట, వడ్డాది ప్రజలను అప్రమత్తం చేశామన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు



మాడుగుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మాడుగులకి చెందిన శ్రీనాధు శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈమేరకు మాజీ మంత్రి టీజీ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా సోమవారం నియామకపత్రాన్ని శ్రీనివాసరావు అందుకున్నారు. శ్రీనాధు శ్రీనివాసరావుని గ్రామ పెద్దలు, పలువురు అభిమానులు అభినందించారు.

వరి విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన

మాడుగుల రూరల్,అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోడూరులో మంగళవారం వరి విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ పీడీ ఆశాదేవి, నర్సీపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీదేవి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో వాసుదేవరావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీధర్, కొండెంపూడి కేవీకే శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, సౌజన్య పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపు పరిశీలన

మాడుగుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోటపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపుని ఎంపీడీవో కొంకి అప్పారావు పరిశీలించారు. ఆధార్‌లో తప్పులు సరిదిద్దడం, మార్పులు-చేర్పులు పలు వాటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఎంకే.వల్లాపురం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి, సిబ్బందికి ఎంపీడీవో అప్పారావు ఆదేశించారు.

'భూ వివాదాల పరిష్కారమే గ్రామసభల లక్ష్యం'

బుచ్చెయ్యపేట, అక్టోబరు 22: భూ వివాదాల పరిష్కారమే గ్రామ రెవెన్యూ సభల లక్ష్యమని తహసీల్దార్ ఎం.లక్ష్మి అన్నారు. మంగళవారం ఐతంపూడిలో జరిగిన గ్రామసభల్లో రీసర్వే పేరుతో తమకు అన్యాయం జరిగిందని, పాస్ పుస్తకాల్లో ఉన్న కొలతలు, రీ సర్వేలో వచ్చిన కొలతలు చాలా తేడా ఉన్నాయని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూ ఆక్రమణ సెక్షన్ 22ఏ తారుమారుకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రవణ్, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్ పెద్దాడ నాయుడు, వీఆర్వో ఈశ్వరరావు పాల్గొన్నారు.

'రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

చీడికాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషిచేస్తామని తహసీల్దార్ వైవిఎస్.ప్రసాద్ అన్నారు. మండలంలో వెల్లంకిలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో 62 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కృష్ణంరాజు, వీఆర్‌వో కనకలక్ష్మి, మాజీసర్పంచ్ వంటాకు సూర్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి


ఆందోళన చేస్తున్న గిరిజనులు

రావికమతం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగనన్న రీసర్వేలో గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని కోరుతూ కవ్వగుంట గిరిజనులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవ్వగుంట రెవెన్యూ పరిధిలో అప్పటి ఎమ్మెల్యే ఆదేశాలతో గిరిజనేతరులకు పట్టాలు ఇచ్చారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. గిరిజనేతరులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవిందరావు, పాంగి సూరిబాబు, రబ్బా నాగరాజు, రొబ్బా వరహాలమ్మడిమాండ్ చేశారు.

అయ్యప్పస్వాములు శ్రమదానం

చీడికాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురువోలులో శివాలయానికి రహదారిలో అయ్యప్ప స్వాములు మంగళవారం శ్రమదానం చేశారు. తురువోలు-చోడవరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి శివాలయం వరకూ ఉన్న ఒక కిలోమీటరు రహదారిలో చెత్తచెదారం, తుప్పలను స్వాములు తొలగించారు. గురుస్వామి రెడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పరిశుభ్రం చేశారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన జడ్జి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్డాది, దిబ్బిడిలలోని బీసీ హాస్టళ్లతోపాటు, కస్తూర్బా విద్యాలయాన్ని చోడవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాజేంద్రనాథ్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో మెనూ అమలుపై వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలోని సౌకర్యాలపై ఆరా తీశారు. జడ్జి వెంట స్థానిక ఎస్‌ఐ ఉన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు : సీఐ

చోడవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల నుంచి మద్యం తీసుకుని గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు హెచ్చరించారు. బెల్ట్ దుకాణాలకు వేలం పాటలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు.

నకిలీ స్వర్ణ విత్తనాలపై రైతుల ఆగ్రహం

బుచ్చెయ్యపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేసిన అన్నదాత కంపెనీకి చెందిన ఎంటీయూ 7029 స్వర్ణ రకం విత్తనాలు నకిలీవి అంటగట్టారని, దీనివల్ల తాము నష్టపోయామని మండలానికి చెందిన పలువురు రైతులు విత్తనాభివృద్ధి సంస్థ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తమకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. అన్నదాత కంపెనీకి చెందిన స్వర్ణ రకం విత్తనాలు మొలకెత్తలేదని, నష్టపోయిన తమకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

రీ సర్వేలో తప్పులు సరిచేయండి

దేవరాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట శివారు సీతంపేటలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వేలో తప్పులపై 19 మంది దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గోవిందరాజులు, జానకి, తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న హౌసింగ్ ఏఈ కార్యాలయం

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తెరుచుకున్న ఏఈ కార్యాలయం

కొయ్యూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి వృథాగా వదిలేసిన స్థానిక గృహ నిర్మాణ శాఖ ఏఈ కార్యాలయం మంగళవారం తెరుచుకుంది. ఏఈ గోవిందు కార్యాలయంను శుభ్రం చేయించి పరిసరాలలో పెరిగిన పిచ్చి తుప్పలు తొలగింపచేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యలు సత్వర పరిష్కారానికి వీలుగా మండల కేంద్రంలో నిర్మించిన ఈ కార్యాలయం ఐదేళ్లగా వృథా దర్శనమిస్తోంది. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' రెండు రోజుల కిందట రూ. లక్షలు వెచ్చించారు, వృథాగా వదిలేశారు' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన హౌసింగ్ శాఖ అధికారులు తక్షణం కార్యాలయాన్ని వినియోగంలోకి తేవాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. అయినా, కార్యాలయం పూర్తిస్థాయిలో తెరచి ఉంచేలా ఏఈ చర్యలు తీసుకోవడంపై గృహ నిర్మాణ లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి సన్మానం



విద్యార్థి లోహిత్‌కు సత్కరిస్తున్న వైసీపీ నాయకుడు సురేష్‌కుమార్

డుంబ్రిగుడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ విభాగంలో బంగారు పతకాలను సాధించి గిరిజన విద్యార్థి శెట్టి లోహిత్‌కు వైసీపీ సీనియర్ నాయకుడు సురేష్‌కుమార్ సత్కరించారు. ఈనెల 4,5,6న రాజమండ్రి, గుంటూరులో జరిగిన పోటీల్లో లోహిత్ పరుగు పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభను కనబరిచి మన్యానికి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విద్యార్థికి ఐటీడీఏ సహకారం అందించాలని కోరారు.

తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాడేరురూరల్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తుఫాన్ నేపథ్యంలో పాడేరు విద్యుత్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఎస్ఈ జీఎన్.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 7 రోజులు అల్లూరి జిల్లాలో భారీగా వర్షాలు కురిసే వీలున్నందున విద్యుత్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే, పాడేరు విద్యుత్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షకుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. కలెక్టర్, ఈపీఏపీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కంట్రోల్ రూమ్‌కు ఫోన్: 9490610026 నెంబరు కేటాయించామన్నారు.తెగిపడిన విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాల సమస్యలు, విద్యుత్ అంతరాయాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1912కు గానీ, కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలి.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. మంగళవారం వాతావరణ సమాచారాన్ని ఆయనప్రకటించారు.ఈ మేరకుపాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా రెండుమిల్లీమీటర్లు, గరిష్ఠంగా 10మీ.మీ.వర్షపాతం నమోదువుతుందన్నారు.

స్వచ్ఛ అరకులోయకు సహకరించాలి

అరకులోయ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ అరకులోయకు ప్రతి ఒక్కరు సహకరించాలని సర్పంచి పి.దాసుబాబు కోరారు. పంచాయతీ ఆధ్వర్యంలో అరకులోయ టౌన్‌షిప్‌తోపాటుగా గ్రామస్థులకు తడిపొడి చెత్తను సేకరించేందుకు వీలుగా రెండేసి చొప్పున ప్లాస్టిక్ డబ్బాలను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోని ఈవోపీ ఆర్డీ, ఎంపీటీసీలు ఎల్‌బీ భీమరాజు, దూరియా ఆనందరావు, శుత్రుఘ్న, కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ముంచంగిపుట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. మారుమూల గ్రామాల్లో ప్రత్యేక పోలీసులు బలగాలు విస్తృత గాలింపులు చేపడుతున్నాయి.

నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణ

సీలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీలేరు మీదుగా వెళ్లే నైట్ హాల్ట్ ఆర్టీసీ సర్వీసులు పునరుద్ధరించారు. గత నెల 8తేదీన కురిసిన భారీ వర్షాలకు భద్రాచలం రాత్రివేళ బస్సును విశాఖపట్నం డిపోఅధికారులు రద్దు చేశారు. తాజాగా రహదారులు మరమ్మతులుచేపట్టడంతోఈసర్వీసు అందుబాటులోకి వచ్చింది.

గిరిజనులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

» రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరమైన సేవల్లో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం జిల్లాలోని రెవెన్యూ యంత్రాంగంతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జనన, మరణ ధ్రువపత్రాల జారీ, మ్యుటేషన్‌లకు నోటరీ చేయాలని నిబంధన పెట్టవద్దన్నారు. ఇకపై ధ్రువపత్రాల కోసం వచ్చే వారికి అఫిడవిట్లు అడిగితే తీవ్రంగా పరిగణించి సంబంధిత అధికా రులపై కఠిన చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో 4,110 గ్రామాల్లోని 2.71 లక్షల కుటుంబాలకుగానూ ఇంకా 16 వేల మందికి ఆధార్ కార్డులు లేవని గుర్తించామన్నా రు. వారందరికి ఆధార్ కార్డుల జారీకి చర్యలు చేపట్టాలనిఆదేశించారు. భూములు రీసర్వే చేసి భూ విస్తీర్ణాన్ని గుర్తించి నమోదు చేయాలన్నారు.తహసీల్దార్లు క్షే త్రస్థాయికి వెళ్లాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, అసైన్డ్ భూములను పక్కాగా గుర్తించాలన్నారు కుటుంబ ధ్రువీకరణ పత్రాల జారీపై వీఆర్‌వోలకు తగిన శిక్షణ అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 86 నీటి సంఘాలున్నాయని, వాటికి నవంబరు 21న ఎన్నికలను నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జేసీ ఎంజే అభిషేక్‌గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్య మన్‌పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి బి. పద్మావతి, పీఎంయూ ప్రోగ్రామ్ అధికారి రాంగోపాల్, జిల్లాలో 22 మండలాల తాహసీల్దార్లు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'జన సురక్ష' పోస్టర్ ఆవిష్కరణ

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పొదుపు, బీమా పథకాలకు సంబంధించిన జన సురక్షా పోస్టర్‌ను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రచారం చేపట్టాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.నాయుడు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, నాబార్డ్ డీడీఎం చక్రధరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించరా?

» ఉపాధి జాబ్ కార్డులు పునరుద్ధరించాలి

» ఇసుక సేకరణపై అటవీశాఖ ఆంక్షలు సడలించాలి

» చింతపల్లి మండల సమావేశంలో సభ్యులు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనుషాదేవి

చింతపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చినుకుపడితే పడితే గిరిజన గ్రామాల్లో అంధకారమే..ఈ స్థితిలో సమస్య పరిష్కారానికి పాడేరు నుంచి చింతపల్లికి ప్రత్యామ్నాయంగా 33 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం ప్రతిపాదనలు ఏమయ్యాయని లోతుగెడ్డ సర్పంచ్ చింతర్ల సునీల్ అధికారులను నిలదీశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలుత వివిధశాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో లోతుగెడ్డ సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని ఎందుకు సకాలంలో పరిష్కరించడంలేదని ప్రశ్నించారు, ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో పాడేరు నుంచి చింతపల్లికి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణం కోసం చేపట్టిన ప్రతిపాదనలు ఏమిచేశారని ప్రశ్నించారు. దీనికి ఏఈఈ వనుము ప్రభాకరరావు సమాధానం ఇస్తూ చింతపల్లి, జీకేవీధి మండలాలకు కొరుప్రోలు నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. కొరుప్రోలు విద్యుత్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే మరమ్మతులు చేపట్టే వరకు రెండు మండలాలకు విద్యుత్ సరఫరా చేయలేకపోతున్నట్టు వివరించారు. చింతపల్లికి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణంపై ఉన్నత స్థాయి అధికారులు తీసుకోవాల్సిన నిర్ణయమని తెలిపారు. లోతుగెడ్డ ఎంపీటీసీ సభ్యుడు పాంగి బాబూరావు మాట్లాడుతూ జన్‌మన్ పక్కా గృహాల నిర్మాణం కోసం ఆదివాసీలు ఇసుక సేకరణను వెళ్తే అటవీ శాఖ ఉద్యోగులు అడ్డుకుంటున్నారన్నారు. దీనికి డీఆర్‌వో వెంకటరాజు మాట్లాడుతూ ఆదివాసీలు ఎటువంటి అభ్యంతరం ఉండదని అన్నారు. యర్రబొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ తమ సెగ్మెంట్ పరిధిలో ఐదు గ్రామాల్లో జాబ్ కార్డులు డిలేట్ కావడం వల్ల ఉపాధి పనులు అందడంలేదన్నారు. ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ, ఏపీడీ లోకేశ్ సమాధానం ఇస్తూ సాంకేతిక సమస్య కారణంగా జాబ్ కార్డులు డిలేట్ అయ్యాయని, ఈసమస్యను మరో వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య మాట్లాడుతూ ఈ సమావేశానికి దిగువ స్థాయి ఉద్యోగులు రావడం సరికాదన్నారు. అభివృద్ధి పనులపై సమాచారం ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలేదని, ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళతామన్నారు. దీనికి వర్క్సుఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులకు విజయవాడలో సమావేశం ఉన్నందున వెళ్లారన్నారు. ఎంపీపీ కోరాబు అనుషదేవి మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని రెవెన్యూ, ఆర్టీసీ, వ్యవసాయశాఖ, లంబసింగి పీహెచ్‌సీ వైద్యులపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పి. ఆశాజ్యోతి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రభావతి, ఎంఈవో ప్రసాద్, వైస్ ఎంపీపీలు గోపీనాయ్ శారద, వెంగళరావు, సర్పంచ్‌లఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శుల సేవలు మరువలేం: ఎంపీపీ



బదిలీపై వెళ్తున్న కార్యదర్శులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చింతపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):బదిలీపై వెళుతున్న గ్రామ కార్యదర్శుల సేవలు మరువలేమని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. బుధవారం చింతపల్లి నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన గ్రేడ్-3, 4, 5 కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆదివాసీలకు అందించడంలో కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. అలాగే, చింతపల్లి మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన కార్యదర్శులు ఆదివాసీలకు ఉత్తమ సేవలందించాలన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపీడీవో పి. ఆశాజ్యోతి, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, ఏవో రవీంద్రనాథ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దారుగా ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



కొయ్యూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారుగా ఎస్ఎల్‌వీ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వెలుగు ఏపీఎంగా సాధన



కొయ్యూరు: వెలుగు మండల ఏపీఎంగా కె. సాధన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఏపీఎంగా సీసీ గాంధీ ప్రసాద్ గత ఆరు నెలలుగా కొనసాగారు. తాజాగా జరిగిన సాధారణ బదిలీలలో రోలుగుంట ఏపీఎంగా పనిచేస్తున్న సాధనను మండలానికి కేటాయించారు. దీంతో పూర్తిస్థాయి ఏపీ ఎంగా ఆమె బాధ్యతలు స్వీకరించారు.

తహసీల్దార్ నాగమ్మకు ఘన సన్మానం

డుంబ్రిగుడ: బదిలీపై వెళ్తున్న స్థానిక తహసీల్దార్ నాగమ్మకు కార్యాలయ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. అనకాపల్లి జిల్లా రోలుగుంట బదిలీపై వెళ్తున్న ఆమెకు డిప్యూటీ తహసీల్దార్ ముజీబ్, ఆర్ఐ, హరి, వీఆర్వోలు ఘనంగా సన్మానించారు.గిరిజన ప్రాంతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఆమె ఎంతో కృషి చేశారనికొనియాడారు.

చింతపల్లి ఎస్ఐగా వెంకటేశ్వరరావు



చింతపల్లి: స్థానిక ఎస్ఐగా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. తాజా బదిలీల్లో ఇక్కడ రెండేళ్లపాటు ఎస్సైగా విధులు నిర్వహించిన అరుణ్ కిరణ్‌ని జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కి బదిలి చేయగా ఆయన స్థానంలో టెక్కలిలో పనిచేస్తున్న వెంకటేశ్వరరావుని నియమించారు.ఈమేరకు మంగళవారం ఆయన విధుల్లో చేరారు.

ఎస్సై అరుణ్ కిరణ్ సేవలు అభినందనీయం:సీఐ రమేశ్

చింతపల్లి: రెండేళ్ల పాటు స్థానిక ఎస్ఐగా విధులు నిర్వహించిన అరుణ్ కిరణ్ సేవలు అభినందనీయమని సీఐ కె. రమేశ్ అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్తున్న ఎస్ఐను స్టేషన్ పోలీసు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):కొరుప్రోలు 33కేవీ విద్యుత్‌లైన్‌పై నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో చింతపల్లి, జీకేవీధి మండలాల్లో గురువారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ డీఈఈ ఏవీఎస్ఎం అప్పారావు తెలిపారు. ఈ సమయంలో ప్రైవేటు వ్యక్తులు విద్యుత్ లైన్‌పై ఎటువంటి పనులు చేపట్టరాదన్నారు. సాంకేతిక సమస్య కలిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

గిరిజన రైతులను ఆదుకునేందుకు చర్యలు



పశువులకు పోస్టుమార్టంకు సిద్ధమౌతున్న పశుసంవర్ధకశాఖ సిబ్బంది

కొయ్యూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో మృత్యువాత పడిన పశువులకు చెందిన రైతులను ఆదుకునేందుకు మంగళవారం పశుసంవర్ధకశాఖ సిబ్బంది లాంఛనాలు పూర్తి చేశారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలో మఠంభీమవరం పంచాయతీ మందపల్లి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన పశువుల మందపై పిడుగు పడి 15 పశువులతో పాటు మేక మృత్యువాత పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది మంగళవారం బాధిత రైతులను వెంట పెట్టుకుని సంఘటనా స్థలికి చేరుకుని పశువుల మరణాలకు పిడుగు కారణమా? కాదా.. అనే నిర్ధారణకు విచారణ చేపట్టారు. మృత్యువాత పడిన పశువులకు జీపీఆర్ఎస్ కెమెరాలతో ఫొటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడుతూ నేషనల్ డిజార్డర్ మేనేజ్‌మెంట్ ఎన్‌డిఆర్ఎఫ్ (ఎన్‌డిఆర్ఎఫ్)లో నష్టపోయిన రైతులను ఆదుకునే వీలుందన్నారు.ఒక్కో పశువుకురూ.32,500, మేకకు రూ. 6 వేలు చొప్పున నష్టపరిహారం వస్తుందన్నారు.

మూడురోజులైనా కానరాని రెవెన్యూ సిబ్బంది

అయితే, ఈ సంఘటన చోటు చేసుకుని మూడు రోజులైనారెవెన్యూ సిబ్బంది మాత్రం ఇంతవరకు రాకపోవడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. పశువుల పంచనామా నిర్వహించేందుకు వీలుగా రెవెన్యూశాఖకు సంబంధించి వీఆర్‌వో, ఆర్ఐ తదితర అధికారులు బాధిత రైతుల వద్దకు వెళ్లిన దాఖలాలు లేవు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తహసీల్దారు ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత వీఆర్‌వో పద్మనుంచి ఈ ఘటనపై ఆరా తీశారు. బుధవారం వీఆర్‌వో, ఆర్‌ఐలను మందపల్లి పంపించి పంచనామా జరిపిస్తానని తహసీల్దారు తెలిపారు.

రేషన్ కోసం ఎన్ని కష్టాలో..



సమీపంలో డిపోకు చేర్చాలని కోరుతున్న మందపల్లి వాసులు

కొయ్యూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మఠం భీమవరం పంచాయతీ మందపల్లి వాసులు డీఆర్ డిపోల ద్వారా అందిస్తున్న రేషన్ సరకుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో 30 కుటుంబాలకు రేషన్ కార్డులున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం తదితర నిత్యావసర సరకులు పొందాలంటే గ్రామానికి 35 కిలోమీటర్లు దూరంలో గల 0304074 నెంబరు గల పలకజీడి డిపోకు వెళ్లాల్సివస్తోంది. కొండలు ఎక్కి రెండు వాగులు దాటి రేషన్ సరకులు పొందాల్సిన దుస్థితి నెలకొంది. అయితే, గ్రామానికి ఆరు కిలో మీటర్ల దూరం లో 0313059 నెంబరు గల పందిరాయి కొత్తగూడెంలో జీకే వీధి మండలానికి చెందిన డిఆర్ డిపో ఉంది. మందపల్లికు చెందిన 30 రేషన్‌కార్డులను పీకే గూడెం డిపోకు మార్చి నిత్యావసర సరకులు సరఫరా చేయాలని గత ప్ర భుత్వ హయాంలో పలు పర్యాయాలు పాలకులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆ గ్రామస్థులు వాపోతున్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



పనులు కల్పించాలని కోరుతున్న బొడ్డమానుపాకలు గ్రామ గిరిజనులు

గూడెం కొత్తవీధి, అక్టోబరు 22 ఆంధ్రజ్యోతి: మూడేళ్లగా ఉపాధి పనులు కల్పించడంలేదు.. పనులులేక ఆదివాసీలు వలస పోతున్నామని మండలంలోని బొడ్డమానుపాకలు గ్రామానికి చెందిన ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో 40 ఆదివాసీ కుటుంబాలు నివాసముంటున్నాయి. గిరిజనులందరికీ జాబ్ కార్డులున్నా ఉపాధి హామీ పథకం అధికారులు పనులు కల్పించడంలేదన్నారు. పలు మార్లు మండల పరిషత్ అధికారులకు కోరినా కనీసం పట్టించుకోవడంలేదని వారు వాపోతున్నారు. గ్రామంలో పనులులేక కొంతమంది మైదాన ప్రాంతాల్లో కూలికి వెళ్లిపోతున్నారన్నారు. ఉపాధి పనులు కల్పించకపోవడంతో పీఎం జన్‌మన్ పక్కా గృహాలను సైతం కోల్పోయమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనులుకల్పించాలని గ్రామ పెద్దలు అప్పారావు, నారాయణరావు కోరారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే



కిల్లోగుడలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హుకుంపేట అక్టోబరు 22 ఆంధ్ర జ్యోతి: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామానికి ఉపాధి పను లు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీటి, సాగు నీటి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

గూడ బాలికల పాఠశాల తనిఖీ

మండలంలోని గూడ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులకు గణితం బోధించారు. వారికి పలు ప్రశ్నవేసి సమాధానాలు రాబట్టారు. తరగతి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రోజూ పిల్లలకు ప్రభుత్వ మెను ప్రకారం భోజనాలు వడ్డించాలని కోరారు. చిన్నారులకు సమస్యలు లేకుండా చూడాలని హెచ్ ఎం హర్షన్‌ను కోరారు. నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి పాఠశాలల సమస్యలు

డుంబ్రిగుడ: గిరిజన ఆశ్రమ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుకెళ్లినట్టు అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం అన్నారు. కిల్లోగుడ ఆంగ్ల మాధ్యమ బాలికల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేపట్టారు. భోజన మెనును, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యులు జడ్పి జనకమ్మ, సర్పంచి శారద, ఎంపీటీసీ వరహాలమ్మ, నాయకులు సింహాచలం, కృష్ణారావుపాల్గొన్నారు.

కొమరం భీమ్ పోరాటం ఆదర్శనీయం



కొమరంభీమ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గిరిజన మోర్చా నేతలు

పాడేరురూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యమ నాయకుడుకొమరం భీమ్ పోరాట పటిమను గిరిజన యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసాఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. కొమరం భీమ్ జయంతి సందర్భంగా కొత్తపాడేరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహంచారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సల్లా రామకృష్ణ, కురసా రాజారావు, మినుముల గోపాలపాత్రుడు, ఎస్.ఉమామహేశ్, కాకర చిన్నయ్య, కిల్లో గణేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రాంగణంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పి.సూర్యారావు ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు టి.యోగి, చిన్నబ్బాయి, జయకుమార్, నవీన్, సంజీవ్ కళ్యాణి, భవ్యశ్రీ, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ సేవలు చిరస్మరణీయమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. మంగళవారం కళాశాలలో కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ రమణ, లీలా పావని, కేజియా, సంతోషి, రవీంద్ర నాయక్, జగదీశ్‌బాబు, గ్రంథాలయ అధికారి తాంగుల జగత్‌రాయ్ పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం అభినందనీయం

పాడేరు డీఎఫ్‌వో వెంకట సందీప్ రెడ్డి



అంజోడ సిల్క్‌ఫాం పీనరిలో మొక్క నాటుతున్న డీఎఫ్‌వో వెంకట సందీప్ రెడ్డి

డుంబ్రిగుడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అరకు పరిసరాలను పర్యాటకులకు ఆహ్లాదం కలిగేలా తీర్చిదిద్దడంలో కృషి చేయడం అభినందనీయమని పాడేరు డివిజన్ డీఎఫ్‌వో వెంకట సందీప్ రెడ్డి కొనియాడారు. మండలంలోని అంజోడ సిల్క్‌ఫామ్‌ను ఆయన సందర్శించారు. ఈ పీనరీలో ఆయన మొక్కలు నాటారు. అటవీశాఖ ద్వారా ఏకో టూరిజంతో పర్యాటక కేంద్రాలను తీర్చుదిద్దుతున్నామన్నారు. సిల్క్‌ఫామ్‌ను తీర్చిదిద్దడంలో అటవీ వనసంరక్షణ సమితి భాగస్వామ్యం అభినందనీయమన్నారు. దేశ, విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా మరింతగా తీర్చిదిద్దాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో ఉమమహేశ్వరి , రేంజ్ అధికారి శ్రీనివాసరావు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

డీడీ ఎఫ్ఏసీగా రజిని నియామకంపై హర్షం

జి.మాడుగుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా ఎల్. రజిని నియామకంపై జీఎస్‌యూ విదార్థి సంఘం హర్షం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి బూడిద మాధవ్, బాబీ మాట్లాడుతూ, కుమారి రజిని గిరిజన విద్యార్థులకు మంచి సేవలు అందించాలని కోరారు.

ఆధార్ ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగించుకోవాలి

జి.మాడుగుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని ఈవోపీఆర్డీ డేవిడ్ అన్నారు. కె. కోడాపల్లిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. బుధవారం వరకు ఈ గ్రామంలో సేవలు అందించినట్లు చెప్పారు. 24వ తేదీన సొలభం, 25న వంజరి,పెదలోచలి, భీరం పంచాయతీలలో ప్రత్యేక ఆధార్ సేవలు అందిస్తుమని తెలిపారు.

పీవీటీజీల ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు ప్రకటించాలి

పెదబయలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ పీవీటీజీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న జన్మన్ పథకం ద్వారా గృహాల నిర్మాణానికి రూ. 5 లక్షల కు పెంచాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పలువురు నాయకులు అడుగులపుట్ పంచాయతీ వడ్డేపుట్ గ్రా మంలో జన్మన్ పథకం ద్వారా పీవిటీజీలు నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

ముంచంగిపుట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పీఎం జన్ మన్ గృహాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.త్రినాథ్ అన్నారు. మంగళవారం ఆ పార్టీ మండల మహాసభ వనుగుమ్మలో నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చెక్‌డ్యాంలకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి: ఏవో

పెదబయలు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మారుమూల ఇంజరి పంచాయితీ మల్లెపుట్టు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఆధార్ నవీకరణ, చిరు ధాన్యాల ఆవశ్యకత, వ్యవసాయ యంత్రకరణ, సేంద్రియ సేద్యంపై అవగాహన కల్పించారు. వరి పొలాలను పరిశీలించారు. ఆకుముడత, కంకినల్లి తెగుళ్ల నివారణకు సూచలందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు కె.సుభాకర్,గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు: జడ్పీటీసీ

అనంతగిరి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు అన్నారు. మండలంలోని లుంగుపర్తి పంచాయతీ కేంద్రంలోని కొంతమంది రోడ్డు పనులను అడ్డంగించారు. దీనిపై ఐదు గ్రామాల గిరిజనుల వినతి మేరకు.. జడ్పీటీసీ, స్థానిక సర్పంచ్ జన్ని సన్యాసిరావు కలిసి ఈ రోడ్డు పనులను మంగళవారం పరిశీలించారు. 500 మీటర్ల రోడ్డు వేస్తే.. ఐదు గ్రామాలకు గిరిజనులకు మేలు జరుగుతుందని, అభివృద్ధి పనులకు అడ్డుపడవద్దని ఈసందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలోని పి.తమ్మన్న, బి.చంటిబాబు, రామన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

జి.మాడుగుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏటీడబ్ల్యూవో తిరుపాల్ తెలిపారు. అభ్యర్థులకు మూడు నెలల శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు.

రహదారులు ధ్వంసం.. రాకపోకలు నరకం!

గ్రామాల్లో దారుణంగా రోడ్లు

ఆద్యంతం గతుకులు.. చినుకు పడితే చెరువులు

నిత్యం ప్రమాదాలు.. భయాందోళనలో వాహనదారులు

పట్టించుకోని అధికారులు.. ప్రయాణికుల అగచాట్లు



సబ్బవరం: గాలిబీమవరం వద్ద ధ్వంసమైన రోడ్డు

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు ధ్వంసమయ్యాయి. ఆద్యంతం పెచ్చులూడి రాళ్లు తేలిపోయాయి. ఎక్కడికక్కడే గతుకులు ఏర్పడ్డాయి. చినుకు పడితే నీరు చేరిపోయి చెరువులను తలపిస్తున్నాయి. అయినప్పటికీ అధికారులు, పాలకుల్లో చలనం లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు.

ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దిగజారడంతో నిత్యం ప్రమాదాలు సంభవించి ప్రయాణికులు గాయాల పాలవతున్నారు. జోడుగుళ్ల నుంచి అమృతపురం మీదగా గోపాలపట్నం, షీలానగర్ వెళ్లే రహదారి గండివారి కొంపలు వద్ద పూర్తిగా దెబ్బతినడంతో నిత్యం రాకపోకలు జరిపే ఆటోవాలాలు, ద్విచక్ర వాహన చోదకలు, భారీ వాహన చోదకులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా పినగాడి నుంచి కె.కోటపాడు వెళ్లే రహదారి మొగలిపురం, మలునాయుడుపాలెం తదితర ప్రాంతాల్లో పలు చోట్ల దెబ్బతింది. ముడుకులోతు గోతులు ఏర్పడడంతో నిత్యం ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. మొగలిపురం సమీపంలో ఒకరు ప్రమాదం బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. అదే విధంగా గాలిబీమరం గ్రామంలో పల్లవానిపాలెం వెళ్లే రోడ్డు ధ్వంసమై రాళ్లు తేలిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయా రోడ్లను బాగు చేయాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

అధ్వానంగా రేఖవానిపాలెం రహదారి



పరవాడ: కోనవారి చేలు సమీపంలో రహదారిపై ఏర్పడిన గొయ్యి

పరవాడ: మండలంలోని రావాడ పంచాయతీ పరిధి బొట్టవానిపాలెం జంక్షన్ నుంచి రేఖవానిపాలెంకు ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. రహదారి పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించే గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారి మరింత అధ్వానంగా తయారైంది. ఫలితంగా రోడ్డు ఏదో.. గుంత ఏదో తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిని బాగు చేయాలని గత ప్రభుత్వంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. దీంతో అవస్థలు పడుతూనే ప్రయాణం సాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువును తలపిస్తున్న జోడుగుళ్లు-అమృతపురం-గోపాలపట్నం రహదారి

ఈ రహదారిలోని కోన వారి కోనవారి చేలు, గొల్లగరువు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఈ రహదారి గుండా ప్రయాణం సాగించే రేఖవానిపాలెం, రావాడ, నునపర్తి, గొల్లగుంట ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని గగ్గోలు చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్ల సమయంలో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే గ్రామీణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.



పరవాడ: ఆర్కే లేఅవుట్ సమీపంలో దెబ్బతిన్న రహదారి

లక్ష్యం మేరకు టీడీపీ సభ్యత్వ నమోదు

» 'అనకాపల్లి' ఇన్‌చార్జి పీలా గోవింద



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

అనకాపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును లక్ష్యం మేరకు పూర్తిచేయాలని నియోజకవర్గం ఇన్‌ఛార్జి, ఏపీఎస్‌యూఎఫ్‌ఐడీసీ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి టీడీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసారి నియోజకవర్గం పరిధిలోని అనకాపల్లి, కశింకోట మండలాల్లో 30 వేల సభ్యత్వాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రూ.100 చెల్లిస్తే సభ్యత్వంతోపాటు ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యకర్తలు ఎవరైనా ప్రమాదవశాత్తూ మృతిచెందితే బీమా కంపెనీ రూ.5 లక్షలు పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. సాధారణ మరణం చెందితే దహన ఖర్చులకు పార్టీ తరఫున రూ.10 వేలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం అవుతుందని, కార్యకర్తలందరూ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అనకాపల్లికి చెందిన బొండా లక్ష్మికి రూ.10 వేలు, జోత్స్నకు రూ.18 వేల చెక్కులను గోవింద సత్యనారాయణ అందజేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కాయల మురళి, గొంతిన శ్రీను, కర్రి బాబీ, సబ్బవరపు గణేశ్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ నాశనం

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ సర్వనాశనమైందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.3,200 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థులు అయోమయ స్థితిలో పడ్డారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల సైతం నానా అవస్థలు పడ్డారన్నారు. విద్యాశాఖ మంత్రిగా బొత్స సత్యనారాయణ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రాథమిక విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పాపం మూట కట్టుకున్నారన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని రామకృష్ణ పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ, సంక్షేమానికి పెద్ద పీట

» బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీటీడీ కాంప్లెక్స్‌ల్లో బాలల హక్కుల పరిరక్షణకు, సంక్షేమానికి పెద్ద పీట వేయాల్సిందేనని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. మంగళవారం ఆయన అనకాపల్లి జిల్లాలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీవో షేక్ ఆయిషాలను మర్యాదపూర్వకంగా కలిశారు. బాలల హక్కుల పరిరక్షణకు కమిషన్ తీసుకుంటున్న, జిల్లా యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. అనంతరం పీటీడీ డీపీటీవో కార్యాలయంలో డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సుప్రీంకోర్టు నిబంధనలను అనుసరించి జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని బస్ కాంప్లెక్స్‌ల్లో తల్లిపాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ జిల్లా ప్రధాన కాంప్లెక్స్ నుంచి ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు... జిల్లాలో ఎంతమంది విద్యార్థులు బస్ పాసులు వినియోగిస్తున్నారు, వారిలో బాలురు, బాలికలు ఎంతమంది ఉన్నారు సంబంధిత లెక్కల పై రికార్డులు సమర్పించాలని పీటీడీ అధికారులకు సూచించారు. అలాగే కాంప్లెక్స్‌లోనూ, పరిసర ప్రాంతాల్లో బాల కార్మిక వ్యవస్థ లేకుండా యాజమాన్యం తీసుకుంటున్న చర్యల పై రికార్డులు ఏమైనా ఉన్నాయా, జిల్లా ప్రధాన బస్ కాంప్లెక్స్ ఆవరణలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ సమన్వయంతో బాలల హక్కులు, సంక్షేమానికి సంబంధించి ప్రచార హోర్డింగ్‌లు, అతికించిన వాల్‌పోస్టర్ల వివరాలు వాటిని ఎక్కడెక్కడ అమర్చారో ఆయా వివరాల పై అడిగి తెలుసుకున్నారు. వివిధ డిపోల పరిధిలో విద్యార్థులకు సరిపడినన్ని బస్సులు నడుపుతున్నారా, ఇంకా కొత్తవి సమకూర్చాలని జిల్లా వ్యాప్తంగా అందిన విజ్ఞప్తులు ఎన్ని, పరిష్కరించినవి, పరిష్కరించాల్సివి ఎన్ని అనే దానిపై పూర్తి వివరాలు కమిషన్‌కు సమర్పించాలని ఆదేశించారు. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా డ్రైవర్లు, కండక్టర్లకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు ఇంతవరకు చేపట్టారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో స్త్రీ, శిశుసంక్షేమశాఖ ఇతర శాఖల సమన్వయంతో విరివిగా ప్రచార, ప్రసార సాధనాలు వినియోగంలోకి తీసుకుని శత శాతం బాలల హక్కుల పరిరక్షణ జిల్లాగా అనకాపల్లిని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. డీపీటీవో కె.పద్మావతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తమ పరిధిలో లేని అంశాలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా ప్రణాళికలతో అడుగులు వేస్తున్నామన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ పీటీడీ అధికారుల సమన్వయం, సహాయ సహకారాలతో బాలల హక్కుల పరిరక్షణకు చేయి చేయి కలిపి చక్కని ఫలితాలు సాధిస్తామన్నారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, పీటీడీ ఏడీఎం రవిచంద్ర, డీపీవో పి.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువ మరమ్మతుకు నిధులు మంజూరు

కృష్ణాదేవిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగారంపేట సాగునీటి కాలువ, కల్వర్టు, గేటు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2 లక్షలు మంజూరు చేసినట్టు జల వనరుల శాఖ జేఈఈ రుత్తల రవికిరణ్ తెలిపారు. పాతకృష్ణాదేవిపేట, సిహెచ్.నాగాపురం, కొంగసింగి గ్రామాల్లో సాగునీటి కాలువలను జడ్పీటీసీ మాజీ సభ్యుడు తారక వేణుగోపాల్, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్న పాత్రుడు దృష్టి తీసుకువెళ్లడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని చెప్పారు. కాగా, గత ఐదేళ్ల వైసీపీ పాలకులు సాగునీటి కాలువలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరాయని వేణుగోపాల్ ఆరోపించారు.

పది కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయితో ముగ్గురిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాల ప్రకారం... చింతపల్లి మండలం చెరుకుంపాకలకు చెందిన టెడ్ల కుమారి, పెద అయ్యంగారి మధుసూదనరావు, కిన్నెర్ల గ్రామానికి చెందిన కొర్రా అజయ్‌కుమార్ పది కిలోల గంజాయిని తుని రైల్వే స్టేషన్‌కు తరలించడానికి నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నీలంపేట రోడ్డులో సిద్ధంగా ఉన్నారు. ముందస్తు సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

అగ్రి సెట్‌లో బీఆర్ కళాశాల విద్యార్థినికి 48 ర్యాంకు

నర్సీపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అగ్రిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంకు సాధించిన బీఆర్ అగ్రి కల్చర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని ఎస్.జ్యోతిని కళాశాల ప్రిన్సిపాల్ సరేష్ అభినందించారు. మంగళవారం విద్యార్థినికి రూ.5 వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కార్తీక్ మాట్లాడుతూ ర్యాంకు సాధించడంతో అధ్యాపకుల కృషి ఎంతైనా ఉందని చెప్పారు.

చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ సంపత్‌కుమార్

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్ చెప్పారు. మంగళవారం జోనల్ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మొబైల్ క్లోజ్డ్ కాంపెక్టర్ వాహనాల ద్వారా అనకాపల్లిలోని చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది పట్టణంలో సేకరించిన చెత్తను వాహనాల్లో తీసుకువచ్చిన తర్వాత ఈ క్లోజ్డ్ కాంపెక్టర్ వాహనాల్లోకి డంపింగ్ చేస్తారని, తద్వారా కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా జోనల్ కార్యాలయ ఆవరణలో చెత్త సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నామన్నారు. జోనల్ కమిషనర్ నియామక విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. దీంట్లో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులు మూడు రోజులు విశాఖలోనూ, మూడు రోజులు అనకాపల్లిలోనూ విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని అవి పూర్తయితే పోస్టులు భర్తీ అవుతాయన్నారు. స్టేషన్ రోడ్డు అభివృద్ధి విషయమై చర్యలు తీసుకుంటున్నామని కొంతమందికి టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే టీడీఆర్‌లకు సంబంధించిన సమస్య పరిష్కారమవుతుందని వెబ్‌సైట్ ఓపెన్ చేయడం వల్ల త్వరలోనే టీడీఆర్‌లు బాధితులకు అందజేసి స్టేషన్ రోడ్డు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. నూకాంబిక ఆలయ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. జోన్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. అన్ని జోన్‌ల్లోనూ పనులు సక్రమంగా జరిగేలా తగిన చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.

సమస్యలపై ఎమ్మెల్యే కొణతాలకు వినతి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న గ్రామస్థులు

కొత్తూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆయా సమస్యలపై నేరుగా వివరించారు. అనంతరం 84వ వార్డు కొత్తూరు నరసింగరావుపేట గ్రామంలో శ్రీసీతారామ మహిళ సేవా సంఘానికి ప్రత్యేక స్థలం కేటాయించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా కొణతాలకు మెమోంటో ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొణతాల హామీ ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో డీపీఎం విద్యార్థుల ప్రతిభ

కశింకోట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో డీపీఎం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయుడు ఆచంట రవి మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తిలో ఈ నెల 21న ఎస్జీఎఫ్ నిర్వహించిన అండర్-17 బాలుర పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. 60 కిలోల విభాగంలో అఖిల్ రజిత పతకం, 51 కిలోల విభాగంలో బొర్రా రోహిత్ కాంస్య పతకం సాధించారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపించిన ఇద్దరు విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు వేదుల ప్రభాకరరావు అభినందనలు తెలిపారు.

స్టేషన్ రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ నుంచి వెళ్లే స్టేషన్ రోడ్డు నిర్మాణం తక్షణమే పునఃప్రారంభించి పూర్తి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఏవో బి.సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. పెరుగుబజార్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి చాలా కాలమైనా ఇంతవరకు పూర్తి కాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి నిలిచిపోయిన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల మోహన్, బి. సోమరాజు, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.పద్మజ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తుఫాన్ వల్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడే పరిస్థితి ఉన్నందున గ్రామాల్లో తాగునీటి ట్యాంకలన్నీ పూర్తిగా నింపాలని ఆదేశించారు. అలాగే జనరేటర్లు, పారిశుధ్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో శివరాంప్రసాద్, ఈవోపీఆర్డీ చైతన్య, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉల్లాస్ పథకంపై మహిళలకు అవగాహన



మహిళా సమాఖ్య సభ్యులకు ఉల్లాస్ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లాంగ్ లైఫ్ ఆల్ ఇన్ సొసైటీ) పథకంపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ ప్రాథమిక విద్య చదువుకోనివారికి, చదువు మధ్యలో ఆపేసిన వారికి ఈ పథకం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పథకం అమలు తీరుపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, ఏరియా కో-ఆర్డినేటర్ రాజేశ్వరీ, సీడీపీవో లలితకుమారి, ఏపీఎం సిహెచ్.శ్రీనివాసరావు, పలువురు మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు

» 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

పరవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ బొంకులదిబ్బవీధిలోని ప్రధాన రహదారికి ఆనుకుని స్థానిక టిఫిన్ సెంటర్ వద్ద తాగునీటి పైపులైన్‌కు మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. రక్షిత నీటి పథకానికి సంబంధించిన ఈ పైపులైన్‌కు రహదారి అడుగుభాగం వద్ద రంధ్రం ఏర్పడడంతో కొన్ని రోజులుగా నీరు వృథాగా పోయేది. ఈ విషయాన్ని 'నేల పాలవుతున్న తాగునీరు' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు పైపులైన్‌కు మరమ్మతు పనులు చేపట్టి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పదో తరగతి బాలిక అదృశ్యం

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు గంగవరం గ్రామానికి చెందిన ఒక బాలిక అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం గ్రామానికి చెందిన మాటూరి రామారావు కుమార్తె రూప నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. రోజూ మాదిరిగానే ఈ నెల 19వ తేదీ ఉదయం పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం స్కూల్ వదిలిన తరువాత ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు.. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక అదృశ్యంపై ఆమె తండ్రి ఒక వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారని, ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అభిజిత్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పరవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో గల అభిజిత్ ఫెరో అల్లాయిస్ కంపెనీ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక సినిమాహాల్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అభిజిత్ యాజమాన్యం అక్రమ లే అప్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. వెయ్యి మంది కార్మికులను రోడ్డు పాలు చేయడం దుర్మార్గమన్నారు. 1926 ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం వెంటనే యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలని, సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అభిజిత్ యాజమాన్యం విధించిన అక్రమ లేఅప్ పారిశ్రామిక విధానాల చట్టం ప్రకారం చెల్లదన్నారు. తక్షణమే కార్మికులందరినీ యథావిధిగా విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ టీయూ నాయకులు గేదెల అప్పారావు, కన్నూరు నాయుడు, జి.శ్రీను, ఎం.కృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ సభలతో సమస్యల పరిష్కారం

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల ద్వారా వచ్చే ప్రతీ సమస్యను సకాలంలో పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారం గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రజలు వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామసభకు 69 దరఖాస్తులు వచ్చాయన్నారు. గ్రామంలో 322 ఖాతాలకు గానూ 154.44 ఎకరాల జారాయితీ, 28.304 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. రీ సర్వే తరువాత 1229 ఎల్‌పీఎంలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరీ, డీటీ గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, రాంబాబు, ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

భోగాపురం బాదుషా... ఆ టేస్టే వేరు



- గ్రామీణ ప్రాంతంలో విపరీతమైన క్రేజ్
- పెళ్లిళ్లు, శుభకార్యాల్లో తప్పనిసరిగా వడ్డన
- విదేశాలకూ సరఫరా
- 50 ఏళ్లుగా అందరికీ ఇష్టమైన స్వీటుగా గుర్తింపు

భోగాపురం బాదుషా అంటే తెలియని వారు ఇది కూడా ఒక స్వీటే కదా అనుకుంటారు. కానీ దీనిని ఒక్కసారి రుచి చూస్తే ఎప్పటికీ మరిచిపోరు. దీని కోసం ఎంత దూరం నుంచైనా వస్తుంటారు. 50 ఏళ్లుగా అందరికీ ఇష్టమైన స్వీటుగా గుర్తింపు పొందిన ఈ బాదుషా విదేశాలకు కూడా సరఫరా అవుతుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలు జరిగితే ఈ స్వీటు ఉండాల్సిందే.

స్వీట్లు ఎన్ని ఉన్నా భోగాపురం బాదుషాకు ఉన్న క్రేజ్ వేరు. మిగతా చోట్ల దొరికే బాదుషా కంటే ఇది కొంచెం పెద్ద సైజులో ఉంటుంది. దీని రుచి అమోఘమని తిన్న ప్రతి ఒక్కరూ చెబుతుంటారు. గ్రామాల్లో జరిగే పెళ్లిళ్లు, శుభకార్యాల్లో ఈ బాదుషా తప్పనిసరిగా ఉంటుంది. అలాగే చాలా మంది బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఈ బాదుషాను తప్పనిసరిగా తీసుకు వెళుతుంటారు. మాడుగుల హల్వా స్థాయిలోనే ఈ భోగాపురం బాదుషాకు కూడా ఈ ప్రాంతంలో మంచి పేరుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, బెంగాల్ రాష్ట్రాల్లో సైతం ఈ స్వీటుకు అభిమానులు ఉండడం గమనార్హం. ఇక విదేశాల్లో స్థిరపడిన వారికి కూడా వారి బంధువులు ఇక్కడ ప్రత్యేకంగా బాదుషా తయారు చేయించి పంపిస్తారు.

50 ఏళ్ల ప్రస్థానం

పాయకరావుపేటకు చెందిన పొలిమేర అప్పారావు ఈ స్వీటు తయారీని కశింకోటలో ఉన్న తన బావమరిది బుద్దా గంగునాయుడుకు నేర్పించారు. ఆ తరువాత కశింకోట నుంచి గంగునాయుడు


భోగాపురం బాదుషా

కుటుంబం 50 ఏళ్ల క్రితం అనకాపల్లి జిల్లా చోడవరం మండలం భోగాపురం గ్రామానికి వచ్చి స్థిరపడింది. అప్పటి నుంచి ఈ స్వీటు తయారీ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం గంగునాయుడు వారసులు ఈ స్వీటు తయారీ కొనసాగిస్తున్నారు. సాధారణంగా బాదుషా తయారుచేసిన ఒకటి, రెండురోజుల్లోనే గట్టి పడిపోతుంది. తినడానికి ఇబ్బందిగా కూడా ఉంటుంది. కానీ భోగాపురం బాదుషా మాత్రం పది రోజులైనా మెత్తగా దూదిని తలపించేలా ఉంటుంది. తినడానికి కూడా రుచికరంగా ఉండి అందరికీ ఇష్టమైన స్వీటుగా మారిపోయింది. భోగాపురంలో ఒక్క కుటుంబానికే పరిమితమైన ఈ బాదుషా 50 ఏళ్లుగా అందరికీ ఇష్టమైన స్వీటుగా కొనసాగుతుండం విశేషం. - **చోడవరం, ఆంధ్రజ్యోతి**

ఒకసారి తింటే మళ్లీ వస్తారు



ఈ బాదుషా తయారీ రెసిపీ సీక్రెట్. మా తాత, తండ్రి, తరువాత మాకు తప్ప ఈ రెసిపీ ఎవరికీ తెలియదు. బాదుషా కోసం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు, విదేశాలకు వెళ్లేవారు సైతం ఆర్డర్లు ఇస్తుంటారు. ఊరిలో కౌంటరు ద్వారా కూడా బాదుషాలు అమ్ముతాం. కిలో రూ.300కి ఇస్తాం. కిలోకు పది బాదుషాలు వస్తాయి. అందరికీ నచ్చడం వల్లే ఒకసారి తీసుకున్నవారు మళ్లీ మళ్లీ వస్తుంటారు.

- బుద్దా మహలక్ష్మినాయుడు, భోగాపురం

ఉన్నత శిఖరాలకు గిరిపుత్రుడు

అంటార్కిటికా ఖండంలో అధ్యయన యాత్ర

- ఐదుగురు సభ్యుల భారత శాస్త్రవేత్తల బృందానికి నాయకత్వం
- రెండు నెలలు సాగనున్న పర్యటన
- ప్రశంసలందుకుంటున్న రమణమూర్తి పరధాని
- స్వగ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా ఉక్కుర్బ


రమణమూర్తి పరధాని

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరి యువకుడికి అరుదైన అవకాశం లభించింది. అంటార్కిటికా ఖండంలో రెండు నెలల అధ్యయనానికి ఎంపిక చేసిన ఐదుగురు సభ్యుల భారత శాస్త్రవేత్తల బృందానికి నాయకత్వం వహించే గౌరవం దక్కింది.

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం, తడిగిరి పంచాయతీ, ఉక్కుర్బ గ్రామానికి చెందిన రమణమూర్తి పరధాని భారత భూ అయస్కాంత పరిశోధనా కేంద్రంలో సైంటిస్ట్. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన రమణమూర్తి ఎంవీపీ కాలనీలో ఉన్న కేంద్ర ప్రభుత్వ భూగర్భ పరిశోధనా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రిసెర్చ్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది అంటార్కిటికా ఖండంలో సుమారు రెండు నెలల పాటు అధ్యయనానికి ఎంపిక చేయనున్న శాస్త్రవేత్తల బృందంలో సభ్యుడిగా అవకాశం కల్పించాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా ఇటీవల మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఢిల్లీలో నిర్వహించిన లీడర్ ఇంటర్వ్యూలో ఎంపికయ్యాడు. అనంతరం ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు పూర్తిచేసుకుని, ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన ఫిజికల్ టెస్ట్‌లో ఎంపికయ్యాడు. ఈ మేరకు మంగళవారం అంటార్కిటాలో అధ్యయనానికి బయలుదేరి ముంబై చేరుకున్నారు. అక్కడి నుంచి ఐదుగురు సభ్యుల బృందానికి నాయకత్వం వహించి రెండు నెలల పాటు అధ్యయనం చేస్తారు. కాగా 44వ ఇండియన్ సైంటిఫిక్ ఎక్స్‌పెడిషన్ టు అంటార్కిటికా పేరిట భారత శాస్త్రవేత్తల బృందం బయలుదేరుతుండగా, వారికి నాయకత్వం వహించే మహోన్నత అవకాశం లభించిన రమణమూర్తి పరధానిని పలువురు అభినందించారు.

నేడు జిల్లా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగ సంఘ ఎన్నికలు

మహారాణిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన జిల్లా నర్సింగ్ ఉద్యోగుల సంఘ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కేజీహెచ్ క్లాక్‌టవర్ ప్రాంగణంలో నిర్వహించనున్న ఈ ఎన్నికల్లో జిల్లాలో 555 మంది ఓటుహక్కు వినియోగించుకుంటారన్నారు. టి.గంగాభవాని, వి.ఉషారాణిల ప్యానెళ్ల నుంచి పలు పదవులకు పోటీ పడుతున్నట్లు చెప్పారు. సుమారు ఆరేళ్లుగా వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న ఈ ఎన్నికలు ఎట్టకేలకు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా పోటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేసేందుకు సమయం కేటాయించి అనంతరం లెక్కింపు జరిపి ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. 26న రాష్ట్ర సంఘానికి ఎన్నికలు జరుగుతాయన్నారు.

డిసెంబరు 29న విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

డాబాగార్డెన్స్ అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖలో డిసెంబరు 29న ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు పులగం రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా దేశ, విదేశీ ప్రముఖులు పాల్గొనే ఈ కార్యక్ర మంలో అనేక సినిమాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సినీ రంగం అభివృద్ధిలో భాగంగా 24 విభాగాల్లో పనిచేస్తున్న కళాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. జాతీయ అధ్యక్షుడు హెచ్.ఆర్.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సినీ రంగ పెద్దలతో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం చేస్తామన్నారు. ఏపీ మా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, కుమార్‌నాయక్, అనిల్‌బాబుసెట్టి, ఆశాలత పాల్గొన్నారు.

ఐఎంఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎంపికైన కార్యవర్గం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) విశాఖపట్నం బ్రాంచ్ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్ అండ్ జనరల్ హాస్పిటల్‌లో వర్చువల్ విధానంలో సోమవారం ఉదయం 9 నుంచి మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికలను నిర్వహించారు. 2024-26 కాలానికి జరిగిన ఈ ఎన్నికల్లో అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కేజీహెచ్ గైనకాలజీ వైద్యులు డాక్టర్ ఐ.వాణి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎంపీ జగదీశ్వరరావు, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ ఎంవీఎస్ఎస్ బాపారావు, డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ ఎన్నికయ్యారు. నూతన సభ్యులకు పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'ఏయూ ఈసీలో ఈ అంశాలపై చర్చించండి'

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అనేక విభాగాల్లో అడ్జంక్ట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, గౌరవ ప్రొఫెసర్ల పేరుతో అడ్డగోలు నియామకాలు చేపట్టారని, వీటిపై ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని కోరుతూ ఏయూ ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ అలూమ్నీ అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ ఆరేటి మహేష్, ప్రతినిధులు మంగళవారం వీసీకి వినతి పత్రం సమర్పించారు. ఆయా నిమకాలపై కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని, ఎయిడెడ్ ఫ్యాకల్టీని వర్సిటీలోకి తీసుకువచ్చారని, యూనివర్సిటీ యాక్ట్‌కు విరుద్ధంగా రిజిస్ట్రార్, రెక్టార్ నియామకాలు జరిగాయని, వాటిపై చర్చించాలని కోరారు. గత వీసీ ప్రసాదరెడ్డి హయాంలో తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపేలా చూడాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జాయింట్ సెక్రటరీ మోహన్ బాబు, సభ్యులు శిరీష్, తదితరులు పాల్గొన్నారు.

నరవలో ఆగని అక్రమ క్వారీ తవ్వకాలు


నరవ గ్రామంలోని కొండవాలులో తవ్వకాలు జరిపిన ప్రదేశం

గోపాలపట్నం, అక్టోబరు 22 (ఆంధ్యజ్యోతి): అక్రమ క్వారీ తవ్వకాలకు నరవ గ్రామం కేంద్రంగా మారింది. మూడు నెలల క్రితం అధికారులు దాడులు జరిపి కేసులు నమోదు చేయడంతో కొద్ది రోజులు నిశ్శబ్దంగా ఉన్న అక్రమార్కులు మళ్లీ చెలరేగిపోతున్నారు.

గ్రేటర్ పరిధి 88వ వార్డు నరవ గ్రామంలో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొండవాలు ప్రాంతం ఉంది. ఇక్కడ క్వారీ తవ్వకాలకు గనుల శాఖ గతంలో అనుమతులు ఇచ్చేది. వీటిని అడ్డం పెట్టుకుని నిబంధనల్ని అతిక్రమించి తవ్వకాలు చేపట్టడంతో ఈ ప్రాంతం అగాధంగా మారింది. పర్యావరణానికి తీవ్రముప్పు వాటిల్లుతుందని సుమారు ఆరేళ్ల క్రితం నుంచి గనుల శాఖ అనుమతులు జారీ చేయలేదు. అయినప్పటికీ అక్రమ తవ్వకాలకు అలవాటు పడి రాత్రి వేళల్లో తమ పనికానిస్తున్నారు. అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరించడం తప్ప నిఘా వేసి గట్టి చర్యలు తీసుకోవడం లేదు. సర్వే నెంబర్ 29లో కొండవాలులో అక్రమ తవ్వకాలు చేపడుతున్న ప్రాంతంలో పెందుర్తి మండల రెవిన్యూ అధికారులు దాడులు నిర్వహించి రెండు లారీలు, ఎక్సవేటర్‌ను సీజ్ చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేశారు. రాజకీయ నేతలే పలుకుబడి ఉపయోగించి రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను తరలిస్తున్నారు. తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలు చెరువుల్ని తలపిస్తున్నాయి. ఈ నీటి మడుగుల్లో పడి కొందరు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికైనా అధికారులు ఉక్కుపాదం మోపకపోతే పర్యావరణం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అప్పన్నను దర్శించుకున్న విదేశీయులు


సింహగిరిపై విదేశీయులు

సింహాచలం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఫ్రాన్స్ దేశానికి చెందిన పలువురు దర్శించుకున్నారు. ఆలయంలోని శిల్ప సంపదను తిలకించారు. అనంతరం సింహగిరి ప్రకృతి అందాలను కెమెరాల్లో బంధించారు.

రుషికొండ భవనంలో మ్యూజియం పెట్టాలి


విశాఖపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రుషికొండ భవనంలో రాష్ట్రమ్యూజియం ఏర్పాటుచేయాలని యూపీఎస్సీ సభ్యులు ఆచార్య కేఎస్ చలం ముఖ్యమంత్రిని కోరారు. ఈ మేరకు ఆయనకు ఒక లేఖ రాశారు. విశాఖలో బావికొండ, తొట్లకొండ, పావురాల కొండతో పాటు పవిత్రమైన రుషికొండ ఉందని దీనిపై నిర్మించిన భవనాన్ని మ్యూజియంగా మారింతే కొండ ప్రతిష్ట మరింత పెరుగుతుందన్నారు. ప్రస్తుతం విశాఖలో నేవీకి సంబధించిన చిన్న మ్యూజియం ఉందని, రాష్ట్ర విభజన తరువాత మనకు రావాల్సిన కళాఖండాలు, శిల్పాలు, విశాఖలో లభించిన బౌద్ధ అవశేషాలు ఇప్పటికీ హైదరాబాద్‌లోనే ఉన్నాయని, వాటిని విశాఖకు తేవాలని లేఖలో కోరారు.

జాతీయ వినియోగదారుల హక్కుల మండలి ముఖ్య అధికార ప్రతినిధిగా ఆల్ఫా కృష్ణ


వికాస్ పాండే నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఆల్ఫా కృష్ణ

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల మండలి జాతీయ ముఖ్య అధికార ప్రతినిధిగా నగరానికి చెందిన బి.సన్నికృష్ణ (ఆల్ఫా కృష్ణ) నియమితులయ్యారు. ఈమేరకు ఢిల్లీ లో మంగళవారం మండలి జాతీయ అధ్యక్షుడు వికాస్‌పాండే నియామకపత్రాన్ని అందజేశారు. 2026 డిసెంబ రు 31 వరకూ పదవిలో ఉంటారు. ఆల్ఫా కృష్ణ గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి ఏసీఎంఏ రూ.45 లక్షల విరాళం


ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఏసీఎంఏ కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విశాఖకు చెందిన అఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏసీఎంఏ) విరాళం అందించింది. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి రూ.45,24,116 చెక్కును అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, కార్యదర్శి రాణాజీ, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర, గౌరవాధ్యక్షుడు టి.బాలకృష్ణ, సభ్యులు ఎంవీ రామారావు, సత్యనారాయణ రెడ్డి, శేఖర్ తదితరులు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

డీఎస్ఎన్ఎల్‌యూలో సి-ఫేమ్ సెంటర్ ప్రారంభం


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నమ్రతా పహ్వా, వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఫ్యాషన్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ లా అధ్యయన కేంద్రం (సి-ఫేమ్) ఏర్పాటు చేశారు. న్యాయవాది నమ్రతా పహ్వా మంగళవారం ప్రారంభించారు. ప్రసిద్ధ సంస్థల సృజనాత్మకతను ఇతరులు చోరీ చేస్తే డిజైన్ చేసిన వారి ప్రయోజనాల పరిరక్షణకు ఉన్న చట్టాలతో వివాదాలను ఎలా పరిష్కరించుకో వచ్చో వివరించారు. సినిమా కంటెంట్ రైటర్‌కు ప్రొడక్షన్ హౌస్‌కు మధ్య వచ్చే వివాదాలు, రియాలిటీ షోలు, న్యూస్‌మెటీరియల్, క్రీడలుకు సంబంధించిన చట్టాలపై వివరించారు. అంతకుముందు వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వ్యక్తిత్వ హక్కులు, ఫ్యాషన్ పాముఖ్యతను వివరించారు. అనంతరం సి-ఫేమ్ కేంద్రం నిర్వాహకులు రూపొందించిన బ్రోచర్‌ను అతిథులు, వీసీ ఆవిష్కరించారు.

తుఫాన్ ప్రభావంతో నేటి నుంచి పలు రైళ్లు రద్దు

» మూడు రోజులు ప్రయాణాలకు ఆటంకం

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు (25వ తేదీ వరకు) పలు రైళ్లు రద్దు చేసినట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 23న కన్యాకుమారి-డిబ్రుగర్, సిల్చార్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ, చెన్నై సెంట్రల్-హౌరా మెయిల్, పాండిచ్చేరి-హౌరా, చెన్నై సెంట్రల్-షాలిమార్, పాండిచ్చేరి-భువనేశ్వర్, బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి, ముంబై-భువనేశ్వర్ కోణార్క్, బెంగళూరు-గువహటి, హైదరాబాద్-హౌరా ఈస్ట్‌కోస్ట్, సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా, బెంగళూరు-హౌరా హంసఫర్, బెంగళూరు-హౌరా , సూరత్-బ్రహ్మపూర్, కామాఖ్య-బెంగళూరు, డిబ్రుగర్-కన్యాకుమారి వివేక్, గాంధీధాం-పూరి రైళ్లు రద్దు చేశారు. 24న సికింద్రాబాద్-మల్దా టౌన్ స్పెషల్, తిరునెల్వేలి-షాలిమార్ స్పెషల్, హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా, ఖరగ్‌పూర్-విల్లుపురం, షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్, సంత్రాగచ్చి-మంగళూరు వివేక్, షాలిమార్-చెన్నై కోరమాండల్ , హౌరా-తిరుచిరాపల్లి, హౌరా-బెంగళూరు, షాలిమార్-వాస్కోడిగామ, హౌరా-చెన్నై సెంట్రల్, పాట్నా-ఎర్నాకులం, సంత్రాగచ్చి-చెన్నై సెంట్రల్ స్పెషల్, రూర్కెలా-గుణుపూర్ రాజ్యరాణి, కటక్-గుణుపూర్ మెము, గుణుపూర్-విశాఖ, పలాస-విశాఖ, భువనేశ్వర్-జునాగర్, భువనేశ్వర్-జగదల్‌పూర్, పూరి-గుణుపూర్, విశాఖ-భువనేశ్వర్ వందేభారత్, విశాఖ-డిఘా, గుణుపూర్-రూర్కెలా రాజ్యరాణి, విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ, విశాఖ-బ్రహ్మపూర్ స్పెషల్, చెన్నై సెంట్రల్-హౌరా కోరమాండల్, చెన్నై-సంత్రాగచ్చి, బెంగళూరు-ముజాఫర్‌పూర్, జునాగర్ రోడ్డు-భువనేశ్వర్, జగదల్‌పూర్-భువనేశ్వర్, తంబరం-సంత్రాగచ్చి, బెంగళూరు-హౌరా దురంతో, గుణుపూర్-పూరి, పూరి-తిరుపతి, విశాఖ-గుణుపూర్, విశాఖ-పలాస, విశాఖ-బ్రహ్మపూర్ రైళ్లు రద్దయ్యాయి. కాగా 25న బ్రహ్మపూర్-సూరత్ స్పెషల్, డిఘా-విశాఖ, భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ, బ్రహ్మపూర్-విశాఖ స్పెషల్, గుణుపూర్-విశాఖ స్పెషల్, విశాఖ-అమృతసర్ హిరాకుడ్, గుణుపూర్-పూరి, విశాఖ-గుణుపూర్ స్పెషల్, పూరి-గుణుపూర్ రైళ్లను రద్దుచేశారు.

క్రైం... crime news

తాపీమేస్త్రి ఆత్మహత్య


ఆనందరావు (ఫైల్)

ఎండాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూర్య తులసీనగర్‌లో తాపీమేస్త్రిగా పనిచేసే మీసాల ఆనందరావు (32) ప్రతిరోజూ మద్యం తాగి వేధిస్తుండడంతో భార్య సంతోషి నాలుగు రోజుల క్రితం పిల్లలను తీసుకుని శ్రీకాకుళం జిల్లాలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. ఆనందరావు సోమవారం రాత్రి పిన్ని వరస అయిన గడ్డమ్మ ఇంట్లో నిద్రించాడు. మంగళవారం ఉదయాన్నే లేచి తన ఇంటికి వెళ్లిపోయాడు. పరదేశిపాలెం ఉంటున్న ఆయన తండ్రి జగన్నాథరావు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆయన వచ్చి చూసేసరికి ఉరి వేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆనందరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా లావేరు.

11 కిలోల గంజాయితో నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణాకు పాల్పడిన వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.55 వేలు విలువ చేసే 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బీహార్‌లోని ముజాఫర్‌పూర్ జిల్లాకు చెందిన రాజేష్ సహాని గంజాయితో దొరికాడు. అతనిపై జీఆర్పీ ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 31 మందికి జరిమానా

ఆనందపురం/ఎండాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 31 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పన మొత్తం రూ.3.1 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తులు తీర్పునిచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరికి మంగళవారం భీమిలి 15వ అదనపు కోర్టు జడ్జి డిసౌజన్య 1.5 లక్షల జరిమానా విధించారు. పీఎంపాలెం స్టేషన్ పరిధిలో పీఎంపాలెం, మధురవాడ, మారికవలస తదితర ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో 16 మందిపై కేసు నమోదు చేశారు. వారిని రెండో స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 1.6 లక్షల జరిమానా విధించారని ఎస్ఐ జి.ప్రసాద్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో 10.5 కిలోల గంజాయి పట్టివేత


» స్నిఫర్ డాగ్ గుర్తించినట్టు పోలీసుల ప్రకటన

» జీఆర్‌పీ భిన్నవాదన


రైల్వేస్టేషన్‌లో స్నిఫర్‌డాగ్ గుర్తించిన గంజాయి

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో 10.5 కిలోల గంజాయిని నగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...గంజాయి రవాణాతోపాటు విక్రయాలను నియంత్రించేందుకు కొంతకాలంగా స్నిఫర్‌డాగ్ స్క్వాడ్‌తో రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, కొరియర్, ట్రావెల్స్ కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం రైల్వేస్టేషన్‌లోని ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న రెండు బ్యాగులను స్నిఫర్ డాగ్ గుర్తించింది. పోలీసులు తెరిచిచూడగా అందులో 10.5 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. రైలులో గంజాయిని రవాణా చేసేందుకు ఎవరో యత్నించిఉంటారని, తమ రాకను చూసి పరారైపోయి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి చర్యలు నిమిత్తం రైల్వే పోలీసులకు అప్పగించారు. ఇదిలావుండగా అసలు స్నిఫర్‌డాగ్ గంజాయిని గుర్తించలేదని జీఆర్‌పీ పోలీసులు చెబుతున్నారు. ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫారంపై ఒక పిల్లర్ వద్ద సోమవారం నుంచి రెండు బ్యాగులుండడాన్ని ఎదురుగా దుకాణం నిర్వహిస్తున్న సాయి గమనించి... రైల్వే పోలీస్ కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చాడని, అతను బ్యాగులను తెరిచి చూడగా గంజాయి ప్యాకెట్లు కనిపించడంతో సమీపంలో తనిఖీలు నిర్వహిస్తున్న డాగ్ స్క్వాడ్‌ను పిలిచి నిర్ధారణ చేయించారన్నారు. పోలీసులు మాత్రం స్నిఫర్ డాగ్ గుర్తించినట్టు ప్రకటించుకోవడం ఆశ్చర్యంగా ఉందని జీఆర్‌పీకి చెందిన ఒకరు వ్యాఖ్యానించారు.

జీవీఎంసీ ఉద్యోగి కుటుంబానికి బీమా పరిహారం


బీమా సొమ్ము అందజేస్తున్న వామనరావు

విశాఖపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో నాన్‌పీహెచ్ కార్మికుడిగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన గుర్రం సత్యనారాయణ కుటుంబసభ్యులకు జీవీఎంసీ నాన్ పీహెచ్ ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు బీమా పరిహారం అందజేశారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం రూ.4.9 లక్షలు చెక్కును సత్యనారాయణ కుమార్తె ఎస్.సునీతకు అందజేశారు. సొసైటీ సెక్రటరీ కె.ఎల్లయ్య, డైరెక్టర్ అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.